వాగ్దేవీ.. విద్యానొసగుమా!

వైభవంగా వసంత పంచమి



నెల్లూరు : కన్యకాపరమేశ్వరి ఆలయంలో పలకపై అక్షరాలు రాసిస్తున్న పురోహితుడు



సరస్వతీ అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్నీ అమ్మవారి ఆలయాల్లో సోమవారం వసంత పంచమి పర్వదినాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సరస్వతీ పూజలు, హోమాలు, సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. పిల్లలతో కలసి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయాలన్నీ కిటకిటలాడాయి.

సప్తాశ్వ రథమారూఢాం!



వైష్ణవాలయాల్లో సప్తవాహన సేవలు

● నేడు రథసప్తమి

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : సూర్యుడు ప్రత్యక్షదైవం. సకల చరాచర జీవరాసులన్నింటికీ ప్రాణదాత, ఆరోగ్య ప్రదాత. విశ్వమంతటికీ వెలుగునిచ్చి ఆ దినకర కోటి ప్రభాకరుడ్ని పూజించే పర్వదినమే రథసప్తమి. జిల్లాలోని అన్ని వైష్ణవాలయాల్లో మంగళవారం రథసప్తమి పర్వదిన వేడుకలు జరగనున్నాయి. నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి, పెంచలకోన, వేదగిరిలోని నరసింహ స్వామి ఆలయాల్లో సప్తవాహన సేవలు నిర్వహించనున్నా రు. అలాగే స్వామివార్లకు విశేష అభిషేకాలు, అలంకరణ లు జరగనున్నాయి. ఇందుకోసం పాలక మండళ్లు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. రంగనాథస్వామి ఆలయంలో ఉదయం 6గంటలకు సూర్యప్రభ వాహనం, 9.30కి గరుడసేవ, 12కి హంస వాహన సేవ, ఒంటిగంటకు స్నపన తిరుమంజనం, 3.30కి బంగారు తిరుచ్చి, 4.30కి పెద్దశేషవాహనసేవ, రాత్రి 7గంటలకు చంద్రప్రభ వాహన సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో అర్వభూమి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సుజాతమ్మకాలనీలోని అష్టలక్ష్మి ఆలయం, మూలాపేట వేణుగోపాల స్వామి ఆలయం, మూలస్థానేశ్వరాలయంలో సూర్యభగవానుడికి అభిషేకాలు, విశేష పూజలు జరగనున్నాయి.

సింహపురి నుంచే ఉద్యమ కార్యాచరణ

● నెల్లూరులో ముగిసిన సీపీఎం రాష్ట్ర మహాసభలు
● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై పలు తీర్మానాలు



నగరంలో జరిగిన ప్రదర్శనలో అభివాదం చేస్తున్న బృందాకారత్, పక్కన ఎంఏ బేబి,బీవీ. రాఘవులు వీ.శ్రీనివాసరావు తదితరులు



నెల్లూరు (వైద్యం) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : 47 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత సింహపురిలో జరిగిన సీపీఎం 27వ మహాసభలు సోమవారం ముగిశాయి. నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో 1వ తేదీన ప్రారంభమైన ఈ సభలకు రాష్ట్ర, జాతీయస్థాయి నాయకులు పాల్గొని కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తల్లో ఉత్తేజం నింపారు. 500 మంది ప్రతినిధులు పాల్గొన్న సభల్లో మొదటిరోజున సీపీఎం జెండా ఆవిష్కరించిన నేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరిపై దిశానిర్దేశం చేశారు. బీజేపీ మతతత్వ రాజకీయాలకు స్వస్తి పలకాలని, రైతాంగ, కార్మిక, ఇతర వర్గాల అభ్యున్నతికి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలపైనా దుయ్యబట్టారు. మొత్తం 37 తీర్మానాలు చేసిన మహాసభ భవిష్యత్ ఉద్యమాల కార్యాచరణకు బాటలు వేసింది. అలాగే సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా వి.శ్రీనివాసరావుకు రెండోసారి అవకాశం ఇచ్చి, 15 మందితో రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులను ఎనుకున్నారు

● నిధులు రాబట్టడంలో బాబు వైఫల్యం

కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విఫలమయ్యారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. సభలో ఆయన మాట్లాడుతూ సోలార్ విద్యుత్ విధానంలో జగన్మోహన్‌రెడ్డి చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ మాట్లాడుతూ పోలవరం జలాశయం నుంచి బనకచర్లకు నీళ్ల ఇస్తామని చంద్రబాబు చెబుతున్నారన్నారు. 800 అడుగుల ఎత్తులో ఉన్న బనకచర్లకు నీళ్ల సాధ్యమేనా అని ప్రశ్నించారు. ముందుగా హింద్రీనీవా, సోమశిల ప్రాజెక్టులను పూర్తి చేయాలని హితవు పలికారు. ఈ సభలో సీపీఎం నేతలు మూలం రమేష్, విఠపు బాలసుబ్రహ్మణ్యం, మోహన్‌రావు, చంద్ర రాజగోపాల్, డాక్టర్ రాజేశ్వర రావు, డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

● ఆకట్టుకున్న భారీ ప్రదర్శన

ఈ మహాసభల ఆఖరి రోజు సోమవారం సాయంత్రం నగరంలో నిర్వహించిన భారీ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఆత్మకూరు బస్టాండ్ నుంచి బహిరంగ సభ జరిగే వీఆర్సీ మైదానం వరకు సాగిన ప్రదర్శనలో సీపీఎం అగ్రనేతలు బృందాకారత్, బీవీ రాఘవులు, ఎంఏ బేబి, గఫూర్ తదితరులు దారి పొడవునా ప్రజలను అభివాదం చేశారు. అనంతరం వీఆర్సీ వద్ద తెలంగాణ రైతాంగ, సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వారాజ్యం వేదిక వద్ద జరిగిన సభలో నేతలు ప్రసంగించారు. దామర మడుగు నుంచి జక్కా వెంకయ్య పేరిట వచ్చిన విజయోత్సవ కాగడాను బీవీ రాఘవులతోపాటు వి.శ్రీనివాసరావు స్వీకరించారు. దీంతో సీపీఎం 27వ మహాసభలు ముగిసినట్టు నేతలు ప్రకటించారు.



ప్రదర్శనలో పాల్గొన్న సీపీఎం శ్రేణులు



బృందాకారత్‌తో మాట్లాడుతున్న బేబి, రాఘవులు



కాగడాను అందుకుంటున్న రాఘవులు, శ్రీనివాసరావు తదితరులు

అభివృద్ధికి నిధులేవీ!?

కందుకూరు మున్సిపాలిటీకి విడుదలకాని ప్రత్యేక నిధులు

6

ఆ రెండూ టీడీపీ ఖాతాలోకే!

నెల్లూరులోని డిప్యూటీ మేయర్, బుచ్చి నగర పంచాయతీలోని రెండు వైస్‌చైర్మన్ పదవులు తెలుగుదేశం పార్టీయే దక్కించుకుంది. డిప్యూటీ మేయర్‌గా బరిలో నిలిచిన తహసీన్‌కు 41 మంది మద్దతు ప్రకటించగా, బుచ్చిలో పఠాన్ నస్రీన్, శివకుమార్‌లకు 15 మంది మద్దతు ప్రకటించడంతో వీరు గెలిచినట్లు ప్రిసైడింగ్ అధికారులు ప్రకటించారు. కట్టుదిట్టమైన పోలీస్ భద్రత నడుమ జరిగిన ఈ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.



టీడీపీ అభ్యర్థి తహసీన్‌కు మద్దతుగా చేతులెత్తిన రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు



తహసీన్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న మంత్రి నారాయణ, అబ్దుల్ అజీజ్, శ్రీధర్‌రెడ్డి తదితరులు

నగర డిప్యూటీ మేయర్‌గా తహసీన్ ● బుచ్చి వైస్‌చైర్మన్లుగా నస్రీన్, శివకుమార్ ● కట్టుదిట్టమైన భద్రత నడుమ ప్రశాంతంగా ఎన్నికలు

● తహసీన్‌కు 29 ఓట్ల మెజారిటీ

నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) :నెల్లూరు నగరపాలక సంస్థలోని డిప్యూటీ మేయర్ పదవి టీడీపీ కైవసమైంది. సోమవారం జరిగిన ఎన్నికలో 48వ డివిజన్ కార్పొరేటర్ తహసీన్‌కు 29 ఓట్ల మెజారిటీ లభించడంతో ఆమె డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి కార్తీక్ ప్రకటించారు. ఉదయం 11 గంటలకు కార్పొరేషన్‌లోని కౌన్సిల్ హాలులో ఎన్నిక ఉద్దేశాన్ని వివరించిన ప్రిసైడింగ్ అధికారి అయిన జేసీ కార్తీక్ డిప్యూటీ మేయర్‌గా పోటీ చేయాలనుకునే వారిని ఒకరు ప్రతిపాదించి మరొకరు బలపరచాలని సూచించారు. 42వ డివిజన్ కార్పొరేటర్ కరిముల్లాను తమ అభ్యర్థిగా ప్రతిపాదిస్తున్న వైసీపీకి చెందిన కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. తాను బలపరస్తున్నానని మరో కార్పొరేటర్ మహేష్ తెలిపారు. అనంతరం టీడీపీ తరఫున 48వ డివిజన్ కార్పొరేటర్ తహసీన్‌ను డిప్యూటీ మేయర్‌గా ప్రతిపాదిస్తున్న కరణం మంజుల తెలిపగా, బలపరుస్తున్నట్లు మరో కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి వెల్లడించారు. దీంతో పోలింగ్ అనివార్యం కావడంతో చేతులెత్తే పద్ధతి ద్వారా అభ్యర్థులకు తమ మద్దతు తెలపాని ప్రిసైడింగ్ అధికారి కోరారు.

● 29 ఓట్ల మెజారిటీ

ఖలీల్‌అహ్మద్ రాజీనామాతో 54 మంది కార్పొరేటర్ల సంఖ్య కాస్త 53కు చేరింది. వీరితోపాటు సిటీ ఎమ్మెల్యేగా మంత్రి నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీగా ఉన్న చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌లతో కలుపుకుని 57 ఓట్లకు కార్పొరేషన్ సంఖ్యాబలం చేరింది. వీరిలో మంత్రి నారాయణ, ఎంపీ వీపీఆర్‌లు రాకపోవడం, ఇద్దరు కార్పొరేటర్లు గైర్హాజరవడంతో 53 మందితో ఓట్లు లెక్కగట్టారు. వైసీపీ అభ్యర్థి కరిముల్లాకు 12 మంది, టీడీపీ అభ్యర్థి తహసీన్‌కు 41 మంది చేతులెత్తి మద్దతు ప్రకటించారు. 29 ఓట్ల మెజారిటీతో తహసీన్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైనట్లు కార్తీక్ అధికారికంగా ప్రకటించారు. అనంతరం ప్రిసైడింగ్ అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో మంత్రి నారాయణ చేతులమీదుగా తహసీన్ అందుకున్నారు.

● మేయర్, మరొకరు డుమ్మా!

ఈ ఎన్నికకు మేయర్ స్రవంతితోపాటు మరో కార్పొరేటర్ డుమ్మా కొట్టారు. 12వ డివిజన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మేయర్ ఎన్నిక ప్రక్రియ ముగిసిన తర్వాత కౌన్సిల్ హాల్లోకి అడుగుపెట్టారు. 38వ డివిజన్ కార్పొరేటర్‌గా ఉన్న దాసరి అమృత ఎన్నికకు రాలేదు. ఈ ఎన్నికకు వీరు తటస్థంగా ఉండటం వెనుక పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఎన్నిక జరుగుతున్న సమయంలో తహసీన్ వ్యక్తిగతంగా పోటీలో ఉన్నారా? టీడీపీ నుంచి పోటీలో ఉన్నారా? అంటూ బొబ్బల శ్రీనివాస్ ప్రిసైడింగ్ అధికారిని ప్రశ్నించగా జోక్యం చేసుకున్న డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ ఎన్నికను నిబంధనల మేరకు జరుపుతుంటే అడ్డు రావద్దంటూ మండిపడ్డారు. దీంతో కొంతసేపు వీరిద్దరి మధ్య జరిగిన వాదన స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది.

బుచ్చి వైస్‌చైర్మన్లుగా నస్రీన్, శివకుమార్



టీడీపీ అభ్యర్థులకు మద్దతుగా చేతులెత్తిన ఎమ్మెల్యే ప్రశాంతి, కౌన్సిలర్లు

బుచ్చిరెడ్డిపాళెం : నగర పంచయతీలోని రెండు వైస్‌చైర్మన్ల పదవులు టీడీపీ కైవసం అయ్యాయి. నగర పంచాయతీ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో సోమవారం ఎన్నికల అధికారి అయిన డీపీఓ ఎల్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైస్‌చైర్మన్ల ఎన్నికలు జరిగాయి. నగర పంచాయతీ కమిషనర్ ఎల్.చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు 20మంది, ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. టీడీపీ మద్దతుతో 8వవార్డు కౌన్సిలర్ పఠాన్ నస్రీన్ భాను, 9వ వార్డు కౌన్సిలర్ ఎర్రటపల్లి శివకుమార్‌రెడ్డిలను ప్రతిపాదించగా, 14 మంది కైన్సిలర్లతోపాటు ఎమ్మెల్యే చేతులెత్తి మద్దతు తెలిపారు. ఇక వైసీపీ తరఫున 16వ వార్డు కౌన్సిలర్ బిట్రగుంట ప్రమీలమ్మ, 12వ వార్డు కౌన్సిలర్ కందుకూరు యానాదిరెడ్డి బరిలోకి దిగగా, ఆరుగురు కౌన్సిలర్లు మద్దతు ఇచ్చారు. పఠాన్ నస్రీన్, ఎర్రటపల్లి శివ కుమార్‌రెడ్డిలకు మెజారిటీ రావడంతో వైస్ చైర్మన్లుగా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించారు. బుచ్చి సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ సంతోష్‌రెడ్డి పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించి, పాసులు ఉన్న వారినే అనుమతించారు.

121 కేంద్రాల్లో ఇంటర్ ప్రాక్టికల్స్

రేపు ప్రారంభం ● సీసీ కెమెరాల నిఘా ● ఆర్ఐవో శ్రీనివాసులు

ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్ష(ప్రాక్టికల్స్)లు ఈనెల 5వతేదీ నుంచి 20వతేదీ వరకు మూడు దశల్లో ఒకేషనల్ విద్యార్థులకు, ఈనెల 10 నుంచి 20వతేదీ వరకు జనరల్ విద్యార్థులకు రెండు దశల్లో నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షల అనంతరం థియరీ పరీక్షలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణకు చేపడుతున్న చర్యలు, తీసుకుంటున్న జాగ్రత్తలపై ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఏ శ్రీనివాసులు ఆంధ్రజ్యోతి తో పలు అంశాలను తెలియచేశారు.

ఈ ఇంటర్వ్యూ



జిల్లాలో అన్ని మేనేజ్‌మెంట్లు కలిపి మొత్తం 187 జూనియర్ కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థులు 53,003 మంది చదువుకుంటున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరంలో 28,176 మంది, ద్వితీయ సంవత్సరంలో 25,024 మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఈనెల 5వతేదీ నుంచి ఒకేషనల్ ప్రాక్టికల్స్ ప్రారంభం కానుండడంతో సిబ్బందిని సన్నద్ధం చేశాము. జిల్లాలో ఒకేషనల్ విద్యార్థులు 2,275 మందికి ప్రాక్టికల్స్ నిర్వహణకు 21 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే 10 నుంచి 20వతేదీ వరకు 121 కేంద్రాల్లో జనరల్ విద్యార్థులు 23,507 మందికి ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నాము. ఒకేషనల్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు, జనరల్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. సీసీ కెమెరాల నిఘాతో కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహిస్తాము. అన్నీ పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఇంటర్‌బోర్డు అధికారులు నిత్యం పరిశీలిస్తుంటారు. మార్చి 1 నుంచి 20వతేదీ వరకు జరిగే థియరీ పరీక్షలకు జిల్లాలో మొత్తం 79 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిని 28 జోన్లుగా విభజించాము. 53,200 మంది విద్యార్థులు ఆ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు.

● కమిటీ పర్యవేక్షణ

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా పరీక్షల కమిటీ(డీఈసీ)ని నియమిం చాము. ఇప్పటికే ప్రాక్టికల్స్ జరిగే కళాశాలల్లోని ల్యాబ్‌లను పరిశీలించి సమస్యలున్న ప్రాంతాల్లో వెంటనే సరిదిద్ది సరైన పద్ధతిలో ప్రయోగ పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాము. పరీక్షల నిర్వహణకు నియమించిన సిబ్బంది, ఇన్విజిలేటర్లు పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించాము. పరీక్షల సమయంలో ఆకస్మిక తనిఖీలు చేపడతాము. ఎక్కడైనా ఇబ్బందులున్నా, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవు. పరీక్షల పేరుతో అనధికార వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటాము.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

అయ్యా.. మీరే దిక్కు!

● తోడుంటానన్న భర్త ఎటో వెళ్లిపోయాడు ● కన్నబిడ్డ అసువులు బాసాడు!
● ఇంట్లోకి రానివ్వని మెట్టినింటివారు ● ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్న ఓ మాతృమూర్తి ● న్యాయం చేస్తామని హామీ

- వివరాలు 6లో..



కుమారుడు హృతిక్ నందన్ మృతదేహంతో కలెక్టరేట్‌కు చేరుకుని విలపిస్తున్న వరలక్ష్మి



జనార్దన స్వామి ఆలయ
జీర్ణోద్ధరణ ఉత్సవాలు పరిసమాప్తం

దుత్తలూరు(ఉదయగిరి), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయ జీర్ణోద్ధరణ మహాసంప్రోక్షణ ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. ఆయన చేతుల మీదుగా స్వామివారి విగ్రహ, శిఖర కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలు జరిగాయి. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్, కాకర్ల సునీల్, వెంకట్, మాలేపాటి చైతన్యలు చినజీయర్‌స్వామి ఆశీర్వాదాలు పొంది ప్రసాదాలు స్వీకరించారు. భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కావలి డీఎస్పీ శ్రీధర్, ఉదయగిరి సీఐ వెంకటరావుల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాదాల బాబురావు, గ్రామపెద్దలు గోగినేని రామచంద్ర, మాదాల తిమ్మయ్యచౌదరి, మల్లంపాటి గురవయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా అజెండాతో ఉద్యమాలకు కార్యాచరణ

● రాష్ట్రంలోని 5లక్షల ఎకరాలను పేదలకు పంచాలి ● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుల డిమాండ్

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహాసభల ద్వారా ప్రజాఅజెండాతో రానున్న రోజుల్లో ఉద్యమాలు చేపట్టాలని సీపీఎం తీర్మానించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు, రమాదేవి పేర్కొన్నారు. నెల్లూరు అనిల్ గార్డెన్‌లోని రాష్ట్ర మహాసభల వేదిక వద్ద సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని ఎప్పుడు బయటకు వేస్తారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో 5 లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, దాన్ని నిరుపేదలకు పంచిపెట్టాలన్నారు. రాష్ట్రంలోని 1.50 లక్షలమంది కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వటం లేదని చెప్పారు. వారి సంక్షేమానికి ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రత్యేక మార్కెట్‌ల ద్వారా నిత్యావసరాల విక్రయాలు చేయాలన్నారు. జీఎస్టీ నిధులను కేంద్ర నుంచి రాబట్టుకోవడంలో రాష్ట్ర వైఫల్యం చెందుతున్నదన్నారు. స్మార్ట్‌మీటర్లను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించాలని వారు కోరారు. గ్రామీణ ఉపాధి తరహాలోనే పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయకుండా సెయిల్‌లో కలపాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నేత ఉమామహేశ్వరరావు

కోరి తెచ్చుకోవద్దు కేన్సర్

జిల్లాలో కేన్సర్ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. కేన్సర్‌లో ఎన్నో రకాలు ఉన్నప్పటికీ ప్రారంభ దశలోనే గుర్తిస్తే చాలా వరకు తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. కానీ, అవగాహన లోపం, నిర్లక్ష్యం, ఇతరులకు తెలుస్తుందనే భయంతో ఎంతో మంది సకాలంలో పరీక్షలు చేయించుకోక వ్యాధిగ్రస్తులవుతున్నారు. కొందరైతే కేన్సర్ సోకే ప్రమాదం ఉందని తెలిసినా కొన్ని అలవాట్లను మానుకోలేక రోగాన్ని కొనితెచ్చుకుంటున్నారు. ఆ తర్వాత తగిన చికిత్స చేయించుకోక మృత్యువుకు చేరువవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 21 వేల మందికి పైగా కేన్సర్ రోగులు ఉన్నారని గణాంకాలు చెబుతున్నాయి. వీరంతా వ్యాధి రెండోదశకు చేరుకున్న వారే. వైద్య పరీక్షలు చేయించుకోక పోవటంతో ఇంకా ఎంతో మంది వెలుగులోకి రాలేదని, ఈ ఏడాది రోగుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణుల అంచనా. ఈ క్రమంలో అప్రమత్తంగా ఉంటూ కేన్సర్ నుంచి కాపాడుకోవాలని హెచ్చరిస్తున్నారు.



- పొగాకు నమలడం, ధూమపానం, మద్యంపానంతో ప్రబలుతున్న ప్రాణాంతక వ్యాధి
- ఇప్పటికే 21వేల మందికిపైగా బాధితులు
- నోటి, రొమ్ము, సర్వైకల్ కేన్సర్ కేసులే అధికం
- అవగాహనలోపం, నిర్లక్ష్యంతో పెరుగుతున్న వ్యాధిగ్రస్థులు
- ఈ ఏడాది మరింత పెరగొచ్చని అంచనా
- నేడు ప్రపంచ కేన్సర్ అవగాహన దినం

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కేన్సర్ బారినపడి ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించలేకపోవటంతో ఎక్కువ మంది మృత్యువుకు చేరువవుతు న్నారు. సరైన వైద్యం అందక మరెంతో మంది సతమతమవుతున్నారు. ధూమపానం, మద్యపానం కారణంగా నోటి కేన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతోంది. ఇక, మహిళల్లో అయితే రొమ్ము కేన్సర్ బాధితులు 27 శాతం, గర్భాశయ ముఖ ద్వార కేన్సర్ వ్యాధిగ్రస్తులు 18 శాతం నమోదు కావటం ఆందోళన కలిగించే అంశం. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 21 వేల మందికిపైగా కేన్సర్ రోగులు ఉన్నట్లు సమాచారం. మరెంతో మంది పరీక్షలు చేయించుకోక పోవటంతో వెలుగులోకి రాలేదు. వ్యాధిగ్రస్థ మహిళల్లో ఎక్కువ శాతం రొమ్ము కేన్సర్ బాధితులే ఉండటం గమనార్హం. గుట్కా, ఖైనీ, జరదా వంటి మత్తు పదార్థాలు, పొగాకు ఉత్పత్తులు నమలడం వల్ల నోటి కేన్సర్, దవడ, నాలుక, స్వరపేటిక కేన్సర్‌కు గురవుతున్నారు. ఏడాదికేడాదికి ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్నారు. అదేవిధంగా వైరల్ ఇన్‌ఫెక్షన్, సురక్షితంకాని లైంగిక సంబంధాల వల్ల మహిళల్లో గర్భాశయ ముఖద్వార కేన్సర్ బాధితులు ఎక్కువవుతున్నారు. అయితే వైరల్ కేన్సర్‌ను నయం చేయవచ్చని, ఇతర అవయవాలకు సోకిన కేన్సర్ నివారణ కష్టతరమని వైద్యనిపుణులు చెబుతున్నారు.

● జిల్లాలో చికిత్సలు ఇలా ...

కేన్సర్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వపరంగా నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కొంత వరకు చికిత్సలు అందుతున్నాయి. ఇండియన్ రెడ్‌క్రాస్ కేన్సర్ విభాగం ఏటా 5 వేల మందికిపైగా బాధితులకు సేవలు అందిస్తు న్నారు. అలాగే మెడికవర్ ఆసుపత్రిలోనూ కేన్సర్‌కు ప్రత్యేక విభాగం ఉంది. అయితే జిల్లా నుంచి పెద్దసంఖ్యలో వ్యాధిగ్రస్తులు హైదరాబాద్‌లోని బసవ తారకం కేన్సర్ ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఎంతో మంది వైద్య చికిత్సలు చేయించుకుంటున్నారు. చెన్నై లోని ఆసుపత్రులు, తిరుపతి స్విమ్స్‌లోనూ పలువురు చికిత్స పొందుతున్నారు.

రెడ్‌క్రాస్ ఆసుపత్రిలో చికిత్సలు ఇలా..

సంవత్సరం	సర్జరీలు	రేడియేషన్	కీమో
2021	1114	547	4220
2022	886	536	6011
2023	834	547	7405
2024	615	409	5240

అత్యుత్తమ వైద్య చికిత్సలు

కేన్సర్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అత్యుత్తమ వైద్య చికిత్సలు అందిస్తున్నాము. అవసరమైన వారికి కీమోథెరపీ, శస్త్రచికిత్సలు కూడా నిర్వహిస్తున్నాము. సగటున ప్రతి రోజూ ఐదుగురు కేన్సర్ రోగులు ఆసుపత్రికి వస్తుంటారు. ఇక్కడ ముగ్గురు కేన్సర్ వైద్య నిపుణులు అందుబాటులో ఉంటున్నారు. ప్రస్తుతం సమాజంలో ఎక్కువగా నోటి కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్ ప్రబలుతోంది. ఈ వ్యాధి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మహిళలు కనీసం ఏడాదికి ఒకసారైనా బ్రెస్ట్ కేన్సర్, సర్వైకల్ కేన్సర్ పరీక్షలు చేయించుకోవాలి.



- డాక్టర్ పద్మావతి, కేన్సర్ వైద్య నిపుణురాలు, నెల్లూరు జీజీహెచ్ హెచ్‌వోడీ

కట్టుదిట్టంగా ఇంటర్ ప్రాక్టికల్స్

ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి శ్రీనివాసులు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 5 నుంచి ప్రారంభం కానున్న ప్రాక్టికల్స్‌ను కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు తెలిపారు. నగరంలోని ఇంటర్‌బోర్డు కార్యాలయంలో సోమవారం ఆయన చీఫ్ సూపరింటెండెంట్లు, ఎగ్జామినర్లతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు, ప్రాక్టికల్ సామగ్రి వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, బోర్డు నిబంధనలకు అనుగుణంగానే ప్రాక్టికల్స్ జరగాలన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసి న 21 ఒకేషనల్ ప్రాక్టికల్స్ కేంద్రాల్లో ఈనెల 5 నుంచి 9 వరకు తొలివిడత, 10 నుంచి 14వ తేదీ వరకు రెండో విడత, 15 నుంచి 19వతేదీ వరకు మూడోవిడతలో ప్రాక్టికల్స్ నిర్వహిం చనున్నామని పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో మొత్తం 1,245 మంది, రెండో సంవత్సరంలో మొత్తం 1,030 మంది ప్రయోగ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.

● ప్రశాంతంగా పరీక్షలు

ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో తొలి ఘట్టమైన తప్పనిసరి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆర్ఐవో తెలిపారు. ఒకటిన జరిగిన మానవీయ విలువల పరీక్షకు 27,929 మంది, 3న జరిగిన పర్యావరణ విద్య పరీక్షకు 27,921 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఆర్ఐవోతో పాటు డీఈసీ సభ్యులు కేంద్రాలను పరిశీలించారు.ఈ పరీక్షల మార్కులను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామని తెలిపారు. సమావేశంలో డీఈసీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి అవగాహన సమావేశాలు

ఇంటర్ ప్రాక్టికల్స్‌లో పాల్గొనే చీఫ్ సూపరింటెండెంట్, ఎగ్జామినర్లకు ఈనెల 6, 7వతేదీల్లో నగరంలోని డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ. శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్నీ యాజమాన్య కళాశాలలకు సంబంధించి ఫిజికల్స్, బాటనీ లెక్చరర్స్‌కు 6వతేదీ ఉదయం 11 గంటలకు, కెమిస్ట్రీ, జువాలజీ లెక్చరర్స్‌కు 7వతేదీ ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. అలాగే 7వతేదీ మధ్యాహ్నం 3 గంటలకు చీఫ్ సూపరింటెండ్‌లకు, ఒకేషనల్ ప్రాక్టికల్ ఎగ్జామినర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని అన్నీ కళాశాలల లెక్చరర్లు ఆయా రోజుల్లో తప్పక హాజరయ్యేలా ప్రిన్సిపాళ్లు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు



పర్యావరణ విద్య పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐవో డాక్టర్ శ్రీనివాసులు

నేడు ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ రాక

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయ ప్రతాప్‌రెడ్డి మంగళవారం నెల్లూరుకి రానున్నారని ఐఅండ్‌పీఆర్ డీడీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పీడీఎస్ పథకం అమలు తీరును ఆయన పరిశీలిస్తారని, బుధవారం ఉదయం 11గంటలకు క్షేత్రస్థాయిలో ఆయన పర్యటిస్తారని తెలిపారు.

అయ్యా.. మీరే దిక్కు!

● తోడుంటానన్న భర్త ఎటో వెళ్లిపోయాడు ● కన్నబిడ్డ అసువులుబాసాడు! ● ఇంట్లోకి రానివ్వని మెట్టినింటివారు ● ఆదుకోవాలని కలెక్టర్‌ను వేడుకున్న తల్లి ● న్యాయం చేస్తామని అధికారి హామీ

జీవితాంతం తోడుంటానని వాగ్దానం చేసిన భర్త బిడ్డకు అనారోగ్యమని తెలిసి పత్తాలేకుండా పోయాడు. చివరకు చనిపోయిన బిడ్డను తీసుకుని ఆమె అత్తారింటికి చేరుకుంది. మెట్టినింటివారు ఇంట్లోకి రానివ్వలేదు. ఇక తనబాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆ తల్లి బిడ్డ మృతదేహంతో సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుంది. కలెక్టర్ ఆనంద్ ఎదుట గోడు వెల్లబోసుకుంది. న్యాయం చేయాలని వేడుకుంది. స్పందించిన కలెక్టర్ ముందు మీరు బిడ్డను తీసుకుని ఇంటికి వెళ్లండి. న్యాయం చేస్తానని చెప్పడంతో ఆమె వెనుదిరిగింది.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

తనకు న్యాయం చేయాలని కోరుతూ బిడ్డ మృతదేహంతో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను వేడుకుంది. బాధితురాలు వరలక్ష్మి వదిన శ్రీలక్ష్మి ఆంధ్రజ్యోతికి వివరాలు వెల్లడించారు. మూలాపేటలో ఉంటున్న శ్రీకాంత్, వరలక్ష్మిలకు హృతిక్‌నందన్ అనే కొడుకు ఉన్నాడు. గూడూరు మండలం చెన్నూరుకు చెదిన రమణయ్య, వెంకటమ్మల కుమార్తె వరలక్ష్మికి మూలాపేటలో ఉంటున్న శ్రీకాంత్‌కు పెళ్లి అయ్యింది. వీరికి హృతిక్‌నందన్ అనే కుమారుడు ఉన్నాడు. పెళ్లి సందర్భంగా రెండున్నర సవర్ల బంగారం, రూ.5లక్షల నగదు కట్నంగా ఇచ్చారు. వరలక్ష్మి గర్భం దాల్చాక పుట్టినింటికి తీసుకువెళ్లారు. కుమారుడు పుట్టాక కాలం వెళ్లతీ స్తూ శ్రీకాంత్ తప్పించుకుని తిరిగేవాడని శ్రీలక్ష్మి తెలిపారు. చివరకు బిడ్డకు 9వ నెల వచ్చాక అత్తవారింటికి తీసుకుని వచ్చా రు. ఆ తరువాత శ్రీకాంత్ తన భార్యతో కలిసి వేరు కాపురం పెట్టారు. కొద్దిరోజుల తర్వాత హృతిక్‌నందన్ అనారోగ్యం పాలవడంతో శ్రీకాంత్ ఎటో వెళ్లిపోయాడు. మెట్టినింటివాళ్లు కూడా సమాధానం ఇవ్వకపోవడంతో వైద్యం కోసం చెన్నైకు వెళ్లింది. డాక్టర్లు హృతిక్‌నందన్‌ను పరిశీలించి బ్రెయిన్ కేన్సర్ అని, నాలుగో స్టేజీలో ఉందని చెప్పారు. ఆపరేషన్ చేసినా ఏడాది కంటే ఎక్కువకాలం బతకడని చెప్పారు. దీంతో వరలక్ష్మి దిక్కులేని స్థితిలో నెల్లూరుకు చేరుకుంది. వదిన సాయంతో జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో బిడ్డను చేర్పించింది. రెండు నెలలు ఆ బిడ్డకు వైద్యం చేయించాక సోమవారం మృతిచెందాడు. మరణించిన బిడ్డను తీసుకుని అత్తవారింటికి వరలక్ష్మి వెళ్లగా అత్త, ఆడపడుచు, మరిది ఇంట్లోకి రానివ్వలేదు. పైగా ఇంటికి తాళం వేయడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆమె నేరుగా కలెక్టర్‌ను ఆశ్రయించారు.

బోగస్ అయితే మళ్లీ పరీక్షలు!

- దివ్యాంగుల పింఛన్లపై విచారణ
- ఏడు కేంద్రాల ద్వారా సర్టిఫికెట్ల పరిశీలన
- కొందరు నకిలీ గుర్తింపు పొందినట్లు అనుమానం
- ఏరివేతపై ప్రభుత్వ దృష్టి

జిల్లాలోని దివ్యాంగుల పింఛన్లపై విచారణ ప్రారంభమైంది.ఈ విచారణ సోమవారం మొదలు కాగా నాలుగు నెలలపాటు కొనసాగనున్నది. వారికిచ్చిన సర్టిఫికెట్ నకిలీదని తేలితే మళ్లీ దివ్యాంగులకు నిర్ధారణకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలోని వైద్యులే కాకుండా తిరుపతి, చిత్తూరు నుంచి వచ్చిన వైద్యనిపుణులతో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. గతంలో వైద్యులు వారికి అందించిన దివ్యాంగుల గుర్తింపు పత్రాలతోపాటు పరీక్షల ద్వారా వాస్తవికతను తేటతెల్లం చేసేందుకు వైద్యులు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు.



జీజీహెచ్‌లో వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

నెల్లూరు (వైద్యం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 32,638 మంది దివ్యాంగులు ఉన్నట్లు, వారంతా ప్రభుత్వం నుంచి పింఛన్లు తీసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. వీటి పంపిణీలో పలు అవకతవకలు జరిగాయని, వైసీపీ ప్రభుత్వం నకిలీ గుర్తింపు పత్రాలను వైద్యుల చేత అందించి వారికి పెన్షన్‌లు అందిస్తున్నట్లు ప్రస్తుత కూటమి ప్రభుత్వం అనుమానిస్తున్నది. పైగా గతంలో దివ్యాంగులకు రూ. 3,400 పించను అందిస్తుండగా, ప్రస్తుతం రూ. 6వేలు అందిస్తుంది. ఈ నేపథ్యంలో వాస్తవాలు గుర్తించేందుకు దివ్యాంగులకు మరోసారి పరీక్షలు పక్కాగా నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా సోమవారం (ఈనెల 3వతేదీ) నుంచి మే నెల 28 వరకు దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసింది. నకిలీల ఏరివేతపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించటంతో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

● ఏడు కేంద్రాల ఏర్పాటు

నెల్లూరులోని జీజీహెచ్, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కందుకూరు, కావలి ఏరియా ఆసుపత్రులతపాటు కోవూరు, పొదలకూరు, ఉదయగిరి సీహెచ్‌సీల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తుంది. అయితే ఆయా కేంద్రాలకు వచ్చే దివ్యాంగులకు, వారి సహాయకులకు భోజన వసతులు మాత్రం ఏర్పాటు చేయలేదు. దీంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడో మారుమూల గ్రామాల నుంచి వచ్చిన దివ్యాంగులకు అవసరమైన వసతులు ఏర్పాటు చేయకపోవటంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. డీఆర్‌డీఏ నిర్వహణలో జీజీహెచ్‌లో ఈపరీక్షలు ఏర్పాటు చేశారు. రోజుకు 400 మంది దివ్యాంగులను పరీక్షించేలా ఇక్కడ ఏర్పాట్లు ఉన్నాయి. కన్ను, ఈఎన్‌టీ, ఎముకలు, కీళ్ల వ్యాధులకు సంబంధించి దివ్యాంగుల పాత గుర్తింపు పత్రాలతోపాటు తాజాగా పరీక్షలకు సంబంధించి వైద్య నిపుణులు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎమ్మారై వంటి పరికరం జీజీహెచ్‌లో ఉండటంతో ఇక్కడకు దివ్యాంగుల తాకిడి ఎక్కువగా ఉంది.



వైద్య పరీక్షల కోసం వేచి ఉన్న దివ్యాంగులు

పరీక్షలకు అన్ని ఏర్పాట్లు

జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులను క్షుణ్ణంగా పరీక్షించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. పరీక్షల కోసం వచ్చే వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం ప్రస్తుతం 32,638 మందికి పెన్షన్ అందిస్తున్నాం. రూ. 6వేల వంతున ఒక్కొక్కరి ఇస్తున్నాం. అయితే ప్రభుత్వం నుంచి వచ్చిన తాజా ఆదేశాల మేరకు దివ్యాంగుల గుర్తింపు ప్రక్రియ జరుగుతున్నది.

- నాగరాజకుమారి, డీఆర్‌డీఏ పీడీ

అభివృద్ధికి నిధులేవీ!?

- కందుకూరు మున్సిపాలిటీకి విడుదలకాని ప్రత్యేక నిధులు
- గత ప్రభుత్వం రూ.23కోట్లు మంజూరు
- వచ్చింది రూ.10కోట్లు మాత్రమే
- ఆర్థికసంఘం, జనరల్ ఫండ్స్‌తోనే అరకొరగా పనులు



ఆధునీకరణ మొదలైన పార్కు స్థలం

కందుకూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అభివృద్ధి పనులు నిధుల లేమితో మందకొడిగా సాగుతున్నాయి. ఆర్థికసంఘం నిధులు, జనరల్ ఫండ్స్ మినహా ప్రత్యేకనిధులు విడుదల కాకపోతుండటంతో ఈ సమస్య నెలకొంది. గత ప్రభుత్వంలో రూ.23కోట్లు మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు అమలుకు నోచుకోలేదు. ఎన్నికలకు ఆరునెలల ముందు నిధులు మంజూరు చేస్తే రూ.10కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ఈ సమయంలో పనులుచేస్తే బిల్లులు మంజూరవుతాయా లేదా అన్న మీమాంసలో కాంట్రాక్టర్లు పనులు చేయకుండా జాప్యం చేశారు. దీంతో నిధుల్లో రమారమి రూ.కోటి మిగిలిపోయాయి. ఎన్నికల అనంతరం నూతన ప్రభుత్వం ఈ నిధులతో పామూరు రోడ్డు కార్నర్ నుంచి ఆదిఆంధ్రకాలనీకి వెళ్లేమార్గంలో డ్రైను, కొత్త కుమ్మరిపాలెం, మరికొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టగా ఈ పనులు కూడా నేటికీ పూర్తికాలేదు. ఈ పనులకు సంబంధించిన రూ.13కోట్లు విడుదల కాలేదు. అనేకప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం కోసం వినతులు వస్తున్నా అధికారులు ఏ పనులు చేయలేకపోతున్నారు. జనరల్ ఫండ్స్‌తో మెయింటనెన్స్ పనులకు పోను గాయత్రీనగర్‌లో కేవలం రెండు సిమెంటు రోడ్లను రూ.20లక్షలతో ఇటీవల కాలంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజి సిస్టమ్‌తో నిర్మించారు. మరోపక్క పాలక వర్గం లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు పూర్తిస్థాయిలో విడుదల కాకపోవడం మున్సిపాలిటీలో అభివృద్ధికి శాపంగా మారింది.

● పార్కు పనుల ప్రారంభం

రూ.40లక్షల అంచనాతో 2022లో ప్రారంభ మైన దివి లింగయ్యనాయుడు మున్సిపల్ పార్కు ఆధు నీకరణ పనులు మాత్రం ఎట్టకేలకు ఇటీవల ప్రారంభమ య్యాయి. అప్పట్లో సాధారణ నిధులను పార్కు ఆధునీకర ణకు కేటాయించగా సగం వరకు మాత్రమే కాంట్రాక్టరు పను లు చేపట్టి ఏడాది కిందటే నిలిపివేశారు. ప్రస్తుతం మిగిలిన పనులకు సాధారణ నిధులు సమకూర్చేందుకు అధికారులు హామీ ఇవ్వటంతో నాలుగురోజుల కిందట కాంట్రాక్టరు పను లు ప్రారంభించారు. పార్కు ఆధునీకరణలో భాగంగా చెట్లు, పాత భవనాలు, ప్రజలు సేదదీరే అరుగులను పూర్తిగా తొలగించారు. ఈ పనులు పూర్తి చేయకపోవటంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణం నడిబొడ్డున ఉన్న ఈ పార్కు పట్టణ ప్రజలకే కాకుండా గ్రామాల నుంచి వివిధ పనుల కోసం వచ్చిన వారు సేదతీరేందుకూ అనువుగా ఉండేది. ప్రస్తుతం పార్కు పనులు ప్రారంభించినందున పిల్లలకు ఆడుకునే ఉపకరణాలు, ఓపెన్ జిమ్, షటిల్ కోర్టు, పచ్చదనానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

● నుడా నిధులతో ప్రతిపాదనలు

ఇటీవల కాలంలో రూ.2కోట్ల నుడా నిధులు మున్సిపాలిటీకి మంజూరు చేసేందుకు అనుమతి రాకపటంతో పామూరు రోడ్డు జంక్షన్ అభివృద్ధి.. అక్కడి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు డివైడర్.. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటికి అనుమతులు వస్తే టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

నిధుల లేమితో అభివృద్ధికి ఆటంకం

మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు నిధులలేమి సమస్యగా మారింది. ప్రస్తుతం అభివృద్ధి పనులకు ఎలాంటి నిధులు లేవు. జనరల్ ఫండ్స్‌తో అత్యవసర మెయింటనెన్స్ పనులు చేయించగలుగుతున్నాం. నుడా నిధులకు సాంకేతిక అనుమతులు వస్తే పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

- గణపతి, డీఈఈ





కొత్త ట్రాక్‌లో వాహనం నడుపుతున్న, సెన్సార్‌కు చిప్ చూపుతున్న చోదకుడు



చిప్ చూపుతున్నప్పుడు డిస్‌ప్లే బోర్డు



సెన్సార్‌ను పరిశీలిస్తున్న ఎంవీఐలు

ఆటోమేటెడ్ టెస్ట్ ఆరంభం

● తొలిరోజు 28 మందికి 16 మంది పాస్

నెల్లూరులోని డీటీసీ కార్యాలయంలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌పై సోమవారం నుంచి డ్రైవింగ్ టెస్టులు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో మొదటి విడతలో చిత్తూరు, అనంతపురం, కర్నూలు, విజయవాడ ప్రాంతాల్లో ఈ ట్రాక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెండో విడతలో నెల్లూరు డీటీసీ కార్యాలయంలో ట్రాక్ ఏర్పాటు చేశారు. ఈనెల ఒకటి నుంచి ట్రయల్ రన్‌ను రవాణాశాఖ అధికారులు పూర్తి చేశారు. ఈ క్రమంలో సోమవారం నుంచి పూర్తి స్థాయిలో ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లకు డ్రైవింగ్ టెస్టులు నిర్వహించారు.ఈ ట్రాక్‌లో సెన్సార్లు, కెమెరాలు, వీఎం ఎస్ బోర్డులు, సెన్సార్లతో కూడిన బుల్లెట్లను బ్రేక్ఇన్‌స్పెక్టర్లు బాలమురళీకృష్ణ, రఫీలు పరిశీలించారు. తొలిరోజు 28 మందికి పరీక్షలకు హాజరు కాగా 16 మంది మాత్రమే పాస్ అయ్యారు.

- నెల్లూరు, (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)

crime news నేర వార్తలు ఆంధ్రజ్యోతి

అనారోగ్యంతో ఆత్మహత్య

ఉదయగిరి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఓ వృద్ధుడు పురుగు మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దుర్గంపల్లిలో ఆదివారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సింగనబోయిన చినచెన్నయ్య (65) మూడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో ఇంట్లో వంగ చెట్లకు కొట్టేందుకు తెచ్చిన పురుగు మందును బాత్‌రూంలో సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి సోమవారం తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

బిట్రగుంట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని అల్లూరు రోడ్డు - బిట్రగుంట స్టేషన్ల మధ్య సోమవారం సాయంత్రం 206/6-8 కిలోమీటర్ల వద్ద ఉన్న దిగువమార్గంలో వ్యక్తి (25) మృతదేహం గుర్తించినట్లు కావలి జీఆర్పీ పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరావు మాట్లాడారు. ఆదివారం రాత్రి రైల్లో నుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఉంటారని తెలిపారు. నల్లని ఫుల్ హ్యాండ్ టీషర్టు, బ్లూ కలర్ జీన్స్‌ప్యాంటు, బ్లూ కలర్ ఫుల్ డ్రాయర్ ఆధారాలుగా గుర్తించారు. మృతదేహాన్ని కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భర్తపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): భార్యను వేధిస్తున్న భర్తపై నగరంలోని వేదాయపాలెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు, నెల్లూరు టైలర్స్‌కాలనీ ప్రాంతానికి చెందిన రాజ్యలక్ష్మి-వెంకట శివనారాయణ దంపతులు. వారికి కుమారుడు, కుమార్తె సంతానం. ఆయన కరెంట్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యానికి బానిసైన శివనారాయణ భార్యను శారీరకంగా, మానసికంగా వేధించేడు. ఈ మేరకు రాజ్యలక్ష్మి సోమవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ ముత్యాల రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ వేస్ట్ తరలిస్తున్న వాహనం పట్టివేత

సంగం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటిపాళెం చేపల కుంటలకు చికెన్ వేస్ట్ తరలిస్తున్న వాహనాన్ని సోమవారం సంగం పోలీసులు పట్టుకుని నిందితుడిపై కేసు నమోదు చేశారు. మండలంలోని వంగల్లు గ్రామానికి చెందిన ఓ యువకుడు గత కొంత కాలంగా మినీ లారీలో బెంగళూరు నుంచి డ్రమ్ముల్లో చికెన్ వేస్ట్‌ను మండలంలోని చేపల కుంటలకు తరలిస్తున్నాడు. కాగా, చికెన్ వేస్ట్ దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానిక రైతులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు స్పందించి చికెన్ వేస్ట్ వాహనాన్ని పట్టుకుని యువకుడిపై కేసు నమోదు చేశారు. అనంతరం అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి చికెన్ వేస్ట్‌ను జేసీబీతో కొండప్రాంతంలో గుంత తీసి పూడ్చివేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీవో పొట్టియ్య, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	116
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	234
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7995
వెండి కిలో ధర	రూ. 96,200
వెండి ఒక గ్రాము	రూ.99.20

సమస్యలను మానవతా దృక్పథంతో
పరిష్కరించాలి

అధికారులతో కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వినతుల పరిష్కారానికి మానవతా దృక్పథం అవసరమని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జేసీ కార్తీక్, డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, జడ్పీ సీఈవో విద్యారమ, డ్వామా పీడీ గంగాభవాని, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు తదితరులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి, పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు వ్యక్తిగత శ్రద్ధ పెట్టాలన్నారు. పదేపదే రీ ఓపెన్ అవుతున్న వాటిని ప్రత్యేకంగా పరిశీలించాలని, సరైన పరిష్కారం చూపకుండా మూసివేస్తే అధికారులపై చర్యలు ఉంటాయన్నారు. కాగా వేదికలో 294 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 128, మున్సిపల్ శాఖవి 18, పోలీసు శాఖవి 11, సర్వేశాఖవి 41, పంచాయతీరాజ్ శాఖవి 25, మిగిలినవి ఇతర విభాగాలకు సంబంధించిన అర్జీలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



వృద్ధురాలి నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

నిత్యం లక్ష 'ఉపాధి' పనిదినాలు లక్ష్యంగా పని చేయండి

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతిరోజూ లక్ష పనిదినాలు లక్ష్యంగా ఉపాధిహామీ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో ఉపాధిహామీ, హౌసింగ్, పంచాయతీరాజ్ శాఖలపై సబ్ కలెక్టర్, ఆర్డీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనుల వేగం పెంచాలని, ప్రతిరోజు లక్ష పనిదినాలు లక్ష్యంగా ఎంపీడీవోలు, ఏపీవోలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చాలా మండలాలు ఉపాధి పనుల కల్పనలో ఇంకా వెనుకబడి ఉన్నాయని, ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న అధికారులపై చర్యలు తప్పవన్నారు. పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో సీసీ రోడ్లను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని, పీఎం సూర్యఘర్ యోజనపై పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రిజిస్ట్రేషన్, వెండర్ సెలక్షన్, సోలార్ ప్యానల్ ఇన్‌స్టాలేషన్, సబ్సిడీ మొదలైన దశలను పక్కాగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్‌వో ఉదయభాస్కర్, జడ్పీ సీఈవో విద్యారమ, హౌసింగ్, డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, నాగరాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపి
న్యాయం చేస్తాం

● ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై విచారణ జరిపి, న్యాయం చేస్తామని ఎస్పీ జీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన వేదికకు జిల్లా వ్యాప్తంగా 95 మంది ఫిర్యాదుదారులు తరలి వచ్చి ఎస్పీకి వారి సమస్యలు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీలు గిరిధర్‌రావు, రామారావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

'లక్ష డప్పులు.. వేల గొంతులు'ను
విజయవంతం చేయండి

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత సుబ్బయ్య మాదిగ

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 'లక్ష డప్పులు.. వేల గొంతులు' అనే కార్యక్రమాన్ని ఈనెల 7న నిర్వహిస్తున్నారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్యమాదిగ పిలుపునిచ్చారు. నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం డప్పు కళాకారులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కోసం సబ్ కమిటీ వేసిందన్నారు. ఆ కమిటీ ఈనెల 4న నివేదికను సమర్పించనుందని చెప్పారు. అక్కడ త్వరగా ఎస్సీ వర్గీకరణ జరిగిపోతుందని చెప్పారు. మన రాష్ట్రంలో కూడా వెంటనే వర్గీకరణకు సీఎం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా డప్పు కళాకారులు వారి కళను ప్రదర్శించారు. సమావేశంలో నేతలు పల్లాల శ్రీనివాసులు, డేగ రవి, రాఘవేంద్ర, మాతంగి కృష్ణ, ఆనందరావు, షేక్.రియాజ్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



డప్పు వాయిస్తున్న సుబ్బయ్య, ఇతర నాయకులు

గల్లంతైన వైద్య విద్యార్థి మృతదేహం గుర్తింపు

ముత్తుకూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేలటూరుపాలెం సముద్ర తీరం వద్ద ఆదివారం గల్లంతైన వైద్య విద్యార్థి షణ్ముఖనాయుడు మృతదేహం సోమవారం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు.. సరదాగా సముద్రతీరానికి వచ్చిన వైద్య విద్యార్థుల్లో అనకాపల్లి జిల్లా అనకాపల్లి మండలం మునగపాక గ్రామానికి చెందిన షణ్ముఖనాయుడు సముద్రంలో గల్లంతైన విషయం తెలిసిందే. అతని కోసం ఈతగాళ్ల సాయంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా ప్రయోజనం కనిపించలేదు. సోమవారం ఉదయం 10గంటల ప్రాంతంలో నేలటూరు పాలెం సమీపంలోని జెన్‌కో థర్మల్ కేంద్రం పంప్‌హౌస్ బ్రేకింగ్ వాటర్ వద్దకు షణ్ముఖ మృతదేహం కొట్టుకొచ్చింది. పోలీసులు గజ ఈతగాళ్ల సహకారంతో మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చారు. అప్పటికే అక్కడికి చేరుకున్న ఆ విద్యార్థి తండ్రి వీవీ.నాయుడు, కుటుంబ సభ్యుల రోదనలతో తీరంలో విషాదం నెలకొంది. కృష్ణపట్నం ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి షణ్ముఖ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కుమారుడు షణ్ముఖ నాయుడు మృతదేహం వద్ద విలపిస్తున్న తండ్రి

ఐదో నగర సీఐ, ఎస్ఐపై
ఎస్పీకి ఫిర్యాదు

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఐదో నగర ఎస్ఐ, సీఐలపై సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీకి, టీడీపీ చేనేత విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దోనెపూడి కోటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. తన ఇంటిపై దాడి చేసి క్యాటరింగ్ వస్తువులను ధ్వంసం చేశారని, తనకు న్యాయం చేయాలని ఐదో నగర పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి గత నెల 20న ఫిర్యాదు చేయబోతే, ఫిర్యాదు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. తాను పొదలకూరురోడ్డు సంజయ్‌గాంధీనగర్ 10వవీధి మెయిన్‌రోడ్డులో కాపురం ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు. గత నెల 20న రాత్రి తమ ఇంటి పక్కన ఉన్న పెదిమెట్ల జయమ్మ, ఆమె కుటుంబ సభ్యులు తన ఇంటిపై దాడి చేసి తన క్యాటరింగ్ వస్తువులను ధ్వంసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దోషులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఆటోబోల్తా నలుగురికి గాయాలు

సీతారామపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిన్ననాగంపల్లి గ్రామ సమీపంలో సోమవారం ఓ ఆటోకి యాక్సిల్ ఊడిపోవడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పామూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, శంకర్, అంజి, కృష్ణకు గాయాలయ్యాయి. సీతారామపురం గ్రామంలోని ఓ కార్యక్రమానికి హాజరై పామూరుకు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు గాయపడిన వారిని 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సముద్ర తాబేళ్లను రక్షించండి

● జిల్లా అటవీశాఖ అధికారి మహబూబ్‌బాషా

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సముద్రతీర ప్రాంతాల్లో గుడ్లు పెట్టేందుకు వస్తున్న సముద్ర తాబేళ్లను రక్షించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్‌బాషా ఆదేశించారు. నెల్లూరు నిప్పో కూడలిలోని అటవీశాఖ కార్యాలయంలో సోమవారం మత్స్యశాఖ అధికారులు,అటవీ రేంజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మట్లాడుతూ ప్రతి ఏటా డిసెంబరు నుంచి ఏప్రిల్ వరకు సముద్ర తాబేళ్లు తీరప్రాంతాలకు వచ్చి గుడ్లు పెట్టి వెళతాయని, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా మత్స్యకారులు వేట సమయంలో వలల్లో ఈ తాబేళ్లు చిక్కుకొని మరణిస్తున్నాయన్నారు. వేట సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, సముద్ర తాబేళ్లకు హాని కలిగించే చర్యలు చేపడితే వారిపై ఎలాంటి కేసులు నమోదు చేస్తారన్న వాటిపై మత్స్యకారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో రేంజర్‌లు మాల్యాద్రి,రామిరెడ్డి, ఫిషరీస్, మెరైన్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో మహబూబ్‌బాషా

కమిషనర్ సీసీ నిర్బంధం కేసులో ఇద్దరి అరెస్టు

నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ సీసీ ప్రవీణ్‌ను నిర్బంధించిన ఘటనలో దర్గామిట్ట పోలీసులు సోమవారం ఇద్దరిని అరెస్టు చేశారు. గత నెల 25న ప్రవీణ్‌ను నిర్బంధించిన ఘటనలో మేయర్ భర్త జయవర్ధన్, అతడి అనుచరులు అరుణ్‌కుమార్, సిరాజ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. అదే రోజు జయవర్ధన్‌ను అరెస్ట్ చేయగా సోమవారం అరుణ్, సిరాజ్‌ను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

సోమశిలలో 66.433 టీఎంసీల నిల్వ

అనంతసాగరం ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి సోమవారం 1,694 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 66.433 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,750, ఉత్తర కాలువకు 650, దక్షిణ కాలువ కు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

పీజీ, ఎల్ఎల్‌బీ పరీక్షల్లో 8 మంది డీబార్

వెంకటాచలం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహ పురి యూనివర్సిటీ పరిధిలోని అనుబం ధ కళాశాలల్లో సోమ వారం జరిగిన పీజీ మొదటి, ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్షల లో 8 మంది డీబార్ అయినట్లు యూనివర్సిటీ పరీక్ష ల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలలో 2118 మంది విద్యార్థు లకు 1913 మంది హాజరు కాగా 205 గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 1755 మందికి 1635 మంది హాజరుకాగా 120 మంది గైర్హాజరయ్యా రు. ఉదయం నెల్లూరులోని వీఆర్ ఐఏ ఎస్ కళాశాలలో ఒకరు, మధ్యాహ్నం కావలిలోని వీఎస్ యూ పీజీ సెంటర్‌లో 7 మంది విద్యార్థులు మాస్ కాపీయిం గ్‌కు పాల్పడుతూ పట్టుబడి డీబార్ అయినట్లు తెలిపారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షకు 8 మంది గైర్హాజరు

వీఎస్‌యూ పరిధిలో వీఆర్ ఐఏఎస్ కళాశాలలో సోమవారం జరిగిన డిగ్రీ రెండవ, ఐదవ మెగా సప్లిమెంటరీ పరీక్షకు 8 మంది గైర్హాజరైనట్లు యూని వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, మధ్యా హ్నం జరిగిన పరీక్షల్లో 155 మంది విద్యార్థుల కుగాను 147 మంది హాజరయ్యారని పేర్కొన్నారు.

ఆర్టీసీ జోనల్ ఈడీ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జోనల్ ఆర్టీసీ ఈడీగా జీ నాగేంద్రప్రసాద్ సోమవారం నెల్లూరులోని ఈడీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈడీగా ఉన్న జీ వెంకటేశ్వరరావు గత నెలలో రిటైర్డ్ అయ్యారు. ఆర్టీసీ హెడ్‌క్వార్టర్స్‌లో సీటీఎంగా పనిచేస్తున్న నాగేంద్రప్రసాద్‌ను బదిలీపై నెల్లూరు జోనల్ ఈడీగా నియమించారు. ఈ సందర్భంగా నాగేంద్రప్రసాద్‌ను పలువురు అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈడీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న అధికారి

విస్తారంగా బొప్పాయి సాగు

● మిరపకు ప్రత్యామ్నాయం ● పెరిగిన ఖర్చులు
● దిగుబడి, ధరపై ఆశలు



అనంతసాగరం ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దిగుబడి, ధరపై ఆశతో మండలంలో బొప్పాయి సాగు విస్తీర్ణత పెరిగింది. గతంలో సంజీవ నగరం, గౌరవరం, అగ్రహారం, యాకర్లపాడు, బొమ్మవరం, కామిరెడ్డిపాడు తదితర గ్రామాల్లో రైతులు బోర్ల కింద ఎక్కువగా మిర్చి పంట సాగు చేసేవారు. కాగా, ఏటా పెట్టుబడి ఖర్చు పెరగడంతో పాటు, పంటకు తెగుళ్ల సోకి దిగుబడి తగ్గి తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించారు. గతంలో వంద ఎకరాలలో బొప్పాయి పంట సాగు చేసేవారు. నేడు 1000 ఎకరాలకు పెరిగింది. కాగా, మార్చి నాటికి కోతలు ప్రారంభం కానుండగా వచ్చే దిగుబడిపై రైతులు ఆశలు పెట్టుకున్నారు.

ఎకరాకు రూ. 50 వేలు పెట్టుబడి

బొప్పాయి సాగుకు ఎకరాకు రూ. 50 వేలు ఖర్చు అవుతుందని, బాగా దిగుబడి వస్తే 15 నుంచి 20 టన్నులు వచ్చే అవకాశముందని, ప్రస్తుతం టన్ను ధర రూ. 16 వేలు పలుకుతుండగా ఇదే ధర మరో నెల రోజులు కొనసాగితే తమకు పెట్టుబడులు పోను ఆర్థికంగా కోలుకుంటామని రైతులు అంటున్నారు. రంజాన్ మాసంలో బొప్పాయికి మార్కెట్‌లో బాగా డిమాండ్ ఉంటుందని, ఆ సమయానికి దిగుబడులు వస్తే బాగుంటుందని రైతులు పేర్కొంటున్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కంకర రోడ్డుపైనే ప్రయాణం

- రేణమాల, నేకునాంపేట, తూర్పుపాలెం గ్రామాల ప్రజల అగచాట్లు

కొండాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రేణమాల, నేకునాంపేట పంచాయతీ తూర్పు పాలెం గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. తారురోడ్డు నిర్మాణానికి చేపట్టిన పనులు మధ్యలోనే ఆపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పడుతున్నారు.

- ఏఐఐబీ పథకం నిధులు మంజూరు

పంచాయతీరాజ్ విభాగంలోని ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ విభాగంలోని ఏషి యన్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాంకు ద్వారా రేణమాల పంచాయతీలోని కొత్తఊరు, పాత ఊరులను కలిపేందుకు 1.2కిలోమీటర్లు, నేకునాంపేట పంచాయతీ తూర్పుపాలెం వేళ్లేందుకు ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి (1.5 కిలోమీటర్లు) సుమారు రూ.3కోట్ల నిధులు విడుదలను మంజూరు చేసింది. 2022 ఫిబ్ర వరిలో నెల్లూరు కాంట్రాక్టరు పనులు ప్రారం భించారు. మరమ్మత్తులు ప్రారంభించి కల్వ ర్టు లు, బ్రిడ్జిలు నిర్మించి రోడ్లకు కంకర తొలగించారు. ఈ నిర్మాణ పనుల ప్రక్రియ ఏడాది పాటు కొనసాగించి 2023 ఆగస్టు నుండి పను లను పూర్తిగా నిలిపివేశారు.

- ప్రయాణికులకు తప్పని తిప్పలు

రోడ్డు వేయకపోయినా సరే గతంలో ఉన్న రోడ్డును ధ్వంసం చేసి కంకరరాళ్లను వేయడంతో ప్రయాణానికి ఇబ్బందికరంగా ఉన్నది. ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పలుమార్లు పడిపోయిన సంఘటనలున్నాయి. మందువైపు ఆటో వెళ్తుంటే దుమ్ము రేగి కళ్లలోకి చేరుతుంది. ఉన్నతాధికారులు, పాలకులు పట్టించుకోక పోవడం వలనే తమకు ఈ కష్టాలు అని గ్రామల ప్రజలు వాపోతున్నారు.


తూర్పుపాలెం గ్రామానికి వేళ్లే రోడ్డు

అత్యవసరంలో వాహనాలు రావు

రోడ్డు నిర్మాణం ఆగిపోయి రెండేళ్లు కావస్తోంది. రోడ్డు బాగులేక పోవడంతో అత్యవసర పరిస్థితుల్లో కూడా వాహనాలు గ్రామానికి రావడం లేదు. అధికారులు పట్టించుకొని రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

వెంకట రమణయ్య, తూర్పుపాలెం

రోడ్డు నిర్మాణం చేసుకోవచ్చు

గతంలో మంజూరైన రేణమాల, తూర్పుపాలెం లింకురోడ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. సదరు కాంట్రాక్టరు అగ్రిమెంటు ముగిసింది. గ్రామంలో 500 జనాభా పైన ఉంటే ప్రధానమంత్రి గ్రామసడక్‌యోజన పథకం కింద రోడ్డు నిర్మాణాలను పూర్తిచేస్తాం.

విశ్వేశ్వరరావు, పీఆర్ డీఈఈ, ఉదయగిరి

న్యూస్ బాక్స్

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.4,69,840

అల్లూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలేరమ్మ ఆలయం హుండీ ఆదాయం రూ.4,69,840వచ్చినట్టు ఆలయ ఈవో చిట్టిబాబు సోమవారం తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టామన్నారు. తిరునాళ్ల సందర్భంగా వచ్చిన భక్తులు, ఆలయానికి నిత్యం వచ్చే భక్తులు ముడుపులు సమర్పించారని చెప్పారు.

రోడ్డు మరమ్మతులు


కోతకు గురైన రోడ్డులో చేపట్టిన కాంక్రీట్ గోడ నిర్మాణం

కావలి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలుగోళ్లమ్మ పేట నుంచి అన్నపుగుంట మీదుగా వైకుంఠపురం వైపు వెళ్లే మార్గంలోని రోడ్డు గతేడాది కురిసిన వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా ఉండేది. వాహనదారులు గుంతల్లోకి వెళ్లకుండా స్థానికులు రాళ్లు అడ్డం పెట్టారు. కొన్ని రోజులు అలాగే వదిలేసిన మున్సిపల్ అధికారులు ఎట్టకేలకు స్పందించి ఆ ప్రాంతంలో కాంక్రీట్ గోడ నిర్మించి గుంతను పూడ్చి వేయించారు.

చేపల పెంపకానికి వేలం

కొండాపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కొమ్మిపంచాయతీ గండికట్ల చెరువులో చేపల పెంపకానికి ఇరిగేషన్‌అధికారులు సోమవారం వేలం నిర్వహించారు. రామాలయం వద్ద ఇరిగేషన్ ఏఈ రమేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన షేక్ ఖాజామస్తాన్ రూ.40వేలకు పాడి దక్కించుకున్నారు. ఆరునెలలు (జూన్) చేపలు పెంపకం, అమ్ముకునేందుకు అవకాశం ఉందని ఏఈ తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌ఐ వేణుగోపాల్

సంగం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు కూడలిలో ఎస్‌ఐ రాజేష్ సోమవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దువ్వూరు ఎలైట్ ప్రైవేటు స్కూలు వేణుగోపాల్ సహకారంతో దువ్వూరు కూడలిలో మూడు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

సభలకు తరలిన నేతలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర మహాసభలకు ఆత్మకూరు నుంచి సీపీఎం నేతలు, కార్మిక, కర్షక, ఉద్యోగులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆత్మకూరు నాగయ్య, ఎం నాగేంద్ర, సలారుద్దీన్, కెవిపిఎస్ నాయకుడు పేమల వెంకటయ్య పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

మర్రిపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఆత్మకూరు ఆర్టీవో రాములు సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బస్టాండ్ సెంటర్ హైవే సమీపంలో మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం కలిగిరి ఎక్సైజ్ అధికారులు అదుపు లోకి తీసుకున్నారు. సమాచారం అందుకున్న సీఐ అబ్దుల్‌జలీల్ సిబ్బంది వచ్చి 38 మద్యం సీసాలతోపాటు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.

వెంగమాంబ ఆలయ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే కాకర్ల


హైస్కూల్‌లో స్టేజీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తదితరులు

దుత్తలూరు (ఉదయగిరి), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, టీడీపీ నాయకులతో కలిసి వెంగమాంబ పేరంటాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రామినేని పెదవెంగయ్య, విజయకుమారి దంపతులు రూ.13 లక్షల వ్యయంతో నిర్మించిన స్టేజీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్లు వెంకటరత్నం, బయ్యన్న, సర్పంచ్ నాగయ్య, టీడీపీ నాయకులు కాకర్ల వెంకట్, సునీల్, శ్రీకుర్తి రవీంద్రబాబు, మాదాల తిమ్మయ్య, ఉండేలా గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- గోడపత్రికల ఆవిష్కరణ

వింజమూరు: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఫిబ్రవరి 7వ తేదీన హైదరాబాద్‌లో తలపెట్టిన లక్షల డప్పులు.. వేల గొంతుల ప్రదర్శన గోడపత్రికలను ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకుడు గొల్లపల్లి శ్రీనివాస్‌మాదిగ, జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ మాదిగ, రాష్ట్ర నాయకుడు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, టీడీపీ నాయకులు మాలేపాటి చైతన్య, బెజవాడ గురవయ్యమాదిగ, గొల్లపల్లి మోహన్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

- సీతారామపురం: లక్షల డప్పులు..వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ఎమ్మార్పీఎస్ కన్వీనర్ పిడతల కిరణ్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో చలో హైదరాబాద్ గోడపత్రి కలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల నాయకులు జాషువా, ఇజ్రాయిల్, తిరుపతయ్య, రాజేష్ పాల్గొన్నారు.

వీరజవాన్‌కు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న చెంచలబాబు

కలిగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దేశరక్షణలో విధులు నిర్వహిస్తూ వీరమరణం పొందిన తెల్లపాడుకు చెందిన జవాన్ లింగుంటి వెంకటనరసయ్యకు సోమవారం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ ఘన నివాళులర్పించారు. స్వగ్రా మానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం తెలిపి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో దుత్తలూరు మాజీ ఎంపీపీ శ్రీకుర్తి రవీంద్రబాబు, కుంకు ఉమా మహేష్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

కలిగిరి, ఫిబ్రవరి 3: గీతకులస్థులు మద్యంషాపుల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చినట్లు సోమవారం కలిగిరి సర్కిల్ ఎక్సైజ్ సీఐ అబ్దుల్ జలీల్ తెలిపారు. కలిగిరి సర్కిల్ పరిధిలో కలిగిరి, వింజమూరు మండలాలకు ఒక్కొకటి వంతున ప్రభుత్వం షాపులను కేటాయించిందన్నారు. ఈ నెల 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు రుసుం రూ.2లక్షలని ఒక్కొక్కరు ఎన్ని దరఖాస్తులైన చేసుకోవచ్చన్నారు. గీత కులస్థులకు మాత్రమే అందుకు అర్హులన్నారు.

విట్స్ అధ్యాపకుడు ఫణిభూషణ్‌కు డాక్టరేట్



కావలి టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ వేమూరు ఫణిభూషణ్‌కు ఎస్వీ యూనిర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఎలక్ట్రానిక్స్ కమ్యునికేషన్ విభాగంలో ఇమేజ్ ప్రాసెసింగ్‌లో రీసెర్చ్ అంశమైన ఎ నావెల్ ఇమేజ్ ప్రాసెసింగ్ టెక్నిక్ ఆఫ్ థర్మల్ వేవ్ ఇమేజింగ్ ఫర్ నాన్ డెస్ట్రక్టివ్ ఎవాల్యుయేషన్‌పై చేసిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చినట్లు ఫణిభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధర్‌కుమార్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ప్రత్యూషారెడ్డి, ప్రిన్సిపాల్ శేషయ్య, అధ్యాపకులు ఆయన్ను అభినందించారు.

అటవీ భూములపై విచారణ

బిట్రగుంట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి):తహసీల్దారు సురేష్‌బాబు సోమవారం కార్యాలయంలో సోమవారం కోవూరుపల్లిలో జరుగుతున్న భూ రీసర్వేపై అధికారులతో సమావేశమయ్యారు. కొన్నేళ్లుగా జరుగుతున్న అక్కరాజువారి కండ్రిక ఈనామ్, అటవీ భూముల వివాదంపై కొనుగోలుదారులు, గ్రామస్థులను పిలిపించి విచారణ జరిపారు. పూర్తిస్థాయి విచారణ, రికార్డులను ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

రెవెన్యూ సమస్యలపై దృష్టి పెట్టండి

దగదర్తి, (బిట్రగుంట) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు తహసీల్దారు కృష్ణను కోరారు. సోమవారం ఆయన దగదర్తి మండల ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌డేలో పలు గ్రామాలకు చెందిన చిన్న, సన్నకారు రైతులతో కలిసి సమస్యలను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు, వడ్డే.వినయ్‌కుమార్ ఉన్నారు.

దివ్యాంగుల ధ్రువపత్రాల పరిశీలన


శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఐజాక్‌ప్రవీణ్

ఆత్మకూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ప్రతి సోమ, మంగళ, బుధవారాల్లో దివ్యాంగుల ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. సోమవారం వైద్యశాలలో ప్రారంభమైన పరిశీలన శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. లబ్ధిదారులు సదరం సర్టిఫికెట్, ఆధార్ జెరాక్స్‌ను తీసుకురావాలని కోరారు.

- ఉదయగిరి : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం దివ్యాంగ పించన్లు పొందుతున్న లబ్ధిదారుల ధ్రువపత్రాలను వైద్యులు పరిశీలించారు. నెల్లూరు వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ సీఎస్ రాజు లబ్ధిదారుల ధ్రువపత్రాలను పరిశీలించి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, ఏపీఎం ఖాజారంతుల్లా, డిజిటల్ అసిస్టెంట్ అబ్దుల్‌సమద్, జూనియర్ సహాయకులు సరస్వతి, జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి

సంగం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుమనకొండలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరీదేవి సమేత కాశీవిశేశ్వరస్వామి ఆలయంలో పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో సోమవారం వసంత పంచమిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన, హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

- నేడు రథసప్తమి వేడుకలు

కావలి: స్థానిక బృందావనం హౌసింగ్ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీరాం మాల్యాద్రి సోమవారం ప్రకటనలో తెలిపారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్న సంతర్పణ, రాత్రి ఉపాహారం, రథసప్తమి అన్నదాన కమిటీ సభ్యులు ఏర్పాటు చేస్తారన్నారు.

దివ్యాంగులు, వయోవృద్ధులకు అవగాహన

- సీతారామపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో కాంపోసిట్ రీజనల్ సెంటర్ వారి ఆధ్వర్యంలో దివ్యాంగులకు, వయోవృద్ధులకు అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ (ఫిజియోథెరపీ) రాకేష్ మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పరికరాలు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఇవోపీఆర్డీ భార్గవి, దివ్యాంగులు, తదితరులు పాల్గొన్నారు.

11కేవీ విద్యుత్ వాడకం నేరం

లింగసముద్రం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు వీఆర్.కోట, మొగలి చెర్ల, చినపవని సబ్‌స్టేషన్ల పరిధిలోని 11కేవీ తీగల నుంచి రైతులు పందుల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు అక్రమంగా విద్యుత్ వాడుతున్నారని ఇది చట్టరీత్యా నేరమని కందుకూరు రూరల్ ఏడీఈ వి జయ్‌బాబు సోమవారం తెలిపారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సంఘటనల్లో ప్రాణాలు పోతే రైతులలే బాధ్యత అన్నారు.

అందని పశు వైద్య సేవలు

లింగసముద్రం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక పశు వైద్యశాలకు రెగ్యులర్ వైద్యాధికారి లేకపోవడంతో పాడి రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ పనిచేస్తున్న వైద్యురాలు సౌమ్య మూడునెలల కిందట బదిలీ అయ్యింది. ఇన్‌చార్జి వైద్యులుగా వలేటివారిపాలెం మండలం పోకూరు పశువైద్యాధికారి పులి రమేష్‌ను ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. ఆయన వారానికి మూడురోజులు వైద్యశాలకు వచ్చి వెళుతుంటారని పాడిరైతులు వాపోతున్నారు.

ప్రైవేటు వ్యక్తుల నిఘాలో పేకాట స్థావరాలు

- రోజుకో చోటు మార్చి ఆడుతున్న వైనం
- పోలీసుల సమాచారం కోసం నలుగురు కుర్రాళ్లు
- నిర్వాహకులకు భారీగా ఆదాయం
- అధిక వడ్డీలకు డబ్బులిస్తున్న వ్యాపారులు

లింగసముద్రం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో పేకాట ప్రైవేటు వ్యక్తుల నిఘాలో జోరుగా సాగుతోంది. ముఖ్యంగా తాతాహోటల్ సెంటర్ సమీపంలోని చిల్లచెట్లు, అలాగే కొన్ని ఎంపిక చేసిన ఇళ్లు.. లింగసముద్రం, మొగిలిచెర్ల సమీపంలోని దత్తాత్రేయస్వామి సమీపంలోని అటవీ ప్రాంతం.. స్థానిక హైస్కూల్ ఎగువన ఉన్న అటవీ ప్రాంతం, పెదపవని నుంచి షోడారం వెళ్లే మార్గంలో పేకాట స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ కేంద్రాల్లో ఆడేందుకు కందుకూరు, గుడ్లూరు, కావలి ప్రాంతాల నుండి పేకాటరాయుళ్లు మండలానికి వస్తున్నారని తెలిసింది. ఈ ఆట లక్షల రూపాయల్లో జరుగుతున్నట్టు సమాచారం. మూడునెలల క్రితం తాతా హోటల్ సమీపంలోని ఓ యువకుడికి రూ.20లక్షలు వచ్చిన ట్లుగా పేకాటరాయుళ్లే బహిరంగంగా చెప్పుకుంటున్నారు. పేకాటరాయుళ్లు అందరూ ముందుగా ఫోన్లలో ఎక్కడికి వెళ్లాలో మాట్లాడుకొని వెళుతున్నారు. కొందరైతే తాతాహోటల్ వద్ద వాహనాలు ఉంచి వెళుతున్నారని తెలుస్తోంది. రెండురోజుల క్రితం బదిలీ అయిన ఓ పోలీస్ అధికారి పేకాట నిర్వాహకుల వద్ద అప్పుడప్పుడు డబ్బులు తీసుకుం టున్నట్లు ఆరోపణలున్నాయి. అంతేకాక పోలీసులు వస్తున్నారనే సమాచారం కూడా పోలీస్‌స్టేషన్ నుంచే పేకాటరాయుళ్లకు వస్తున్నట్టు విమర్శలున్నాయి.

- ఒక్కొక్కరు ఒక్కో సెంటర్‌లో..

అయితే ఎక్కడ పేకాట ఆడినా తాతాహోటల్ సమీపంలోని ఓ కాలనీకి చెందిన నలుగురు యువకులను నియమించుకొని వారి ద్వారా పోలీసుల సమాచారం తెలుసుకుంటున్నారు. వీరు ఒక్కొక్కరూ ఒక్కో సెంటర్‌లో ఉండి పోలీసుల సమాచారాన్ని పేకాట నిర్వాహకులకు అందిస్తుండటంతో పేకాటరాయుళ్లు పోలీసులకు దొరకడం లేదు. అందుకు యువకులకు ఒక్కొక్కరికి రోజుకు రూ.1000 ఇస్తున్నట్లు తెలిసింది.

- సమకూరుస్తున్న అన్ని వసతులు..

పేకాట ఆడించే కొందరు నిర్వాహకులకు ప్రతిరోజూ భారీగా ఆదాయం వస్తోంది. వీరు పేకాట ఆడే వారికి అన్ని వసతులు సమకూరుస్తారు. గత కొన్నేళ్ల నుండి వీరి ఆదాయం లక్షల్లో ఉందంటే అతిశయోక్తి కాదు. అలాగే కొందరు వడ్డీ వ్యాపారులు కూడా నేరుగా పేకాట ఆడే చోటుకే వెళ్లి ఆడే వారికి వేలల్లో డబ్బులు అధిక వడ్డీలకు ఇస్తూ, వేలల్లో ఆదాయం గడిస్తున్నారు. దీంతో పేకాట మండలంలో యథేచ్ఛగా కొనసాగుతోంది.

93 శాతం ఈక్రాప్ పూర్తి

- ఎన్ శ్రీహరి, ఏవో, సంగం



సంగం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 20పంచాయతీల్లో సాగులో ఉన్న వరి పంటను 93 శాతం ఈక్రాప్ పూర్తి చేసినట్లు మండల వ్యవసాయాధికారి ఎన్.శ్రీహరి తెలిపారు.

? మిగిలిన 7 శాతం ఈక్రాప్ ఎప్పుడు పూర్తిచేస్తారు.

! డిఫామ్ భూములన్నీ పెండింగ్ చూపిస్తున్నాయి. ఈ భూముల వివరాలను సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లో ఏవో లాగిన్‌కి అప్‌లోడ్ చేస్తే భూముల వివరాలను అప్రూవల్ కోసం తహసీల్దారు లాగిన్‌కు పంపిస్తాం. తహసీల్దారు అప్రూవల్ చేసిన వెంటనే ఈక్రాప్ చేయడానికి వీలవుతుంది.

? ఈకేవైసీ పరిస్థితి ఏమిటీ. ఎంతమేరకు వచ్చింది.

! ఇప్పటివరకు 23శాతం మాత్రమే ఈకేవైసీ పూర్తయింది. రైతులు అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను సంప్రదించి త్వరగా ఈకేవైసీ చేయించుకోవాలి.

? ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తున్నారు.

! మండలంలో ఫిబ్రవరి 10వ తేదీ నుంచి ముమ్మరంగా వరి నూర్పిళ్లు ప్రారంభమవుతాయి. ఈలోపు సంగం, దువ్వూరు పీఏసీఎస్‌ల్లో రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రతిపాదనలు పంపాము. అధికారులు అనుమతి ఇవ్వగానే ప్రారంభిస్తాం.

కార్పొరేషన్ రుణాలివ్వాలి




ధర్నా చేస్తున్న దళిత,గిరిజనులు

కావలి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజనులకు ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ రుణాలివ్వాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి డిమాండ్ చేశారు. ఈ విషయంపై సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట దళిత, గిరిజనులతో ధర్నా చేపట్టి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. గతంలో ఎస్సీ, ఎస్టీ కార్పోరేషన్ రుణాలతో ఆటోలు, ట్రాక్టర్లు, చిన్న వ్యాపారాలకు రుణసౌకర్యం కల్పించేవారన్నారు. ప్రస్తుతం ఈ రుణాలు ఇవ్వకపోవడంతో చిన్న అవసరాలకు వడ్డీ వ్యాపారులు, ప్రయివేట్ బ్యాంకులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో దళిత, గిరిజన నేతలు చలంచర్ల లక్ష్మయ్య, కత్తి వెంకటరత్నం, బ్రహ్మయ్య, జరుగుమల్లి విజయరత్నం, చలంచర్ల వెంకయ్య, సత్యవతమ్మ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కావలి రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ముసునూరు బాలాజీనగర్‌లో సోమవారం నూతన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఏర్పాటుతో స్థానికులు ఎమ్మెల్యే క్రిష్టారెడ్డికి, ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెతో పొంచి ఉన్న ప్రమాదం అని ఆంధ్రజ్యోతి ఇటీవల వార్తను ప్రచురించింది. స్పందించిన అధికారులు చర్యలు తీసుకున్నారు. .

మధ్య తరగతి ప్రజల బడ్జెట్

కావలి టౌన్, ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థికాభివృద్ధి కోసమే అని బీజేపీ రాష్ట్ర సహకోశాధికారి కందుకూరి సత్యనారాయణ తెలిపారు. సోమవారం నమస్కార్ హోటల్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ నేతలు బ్రహ్మానందం, అమరా సు బ్బారావుల తో కలిసి మాట్లాడారు. ఆదాయప పన్ను పరిమితిని రూ.12లక్షల వరకు మినహాయింపు ఇవ్వడం హర్షనీయమన్నారు. అనంతరం వైసీపీ రియల్టర్లు చేయాల్సిన తప్పులపై మాట్లాడారు. తప్పు జరిగిపోయింది సరిదిద్దుకుంటామంటే ఎలా కుదురుతుందని ప్రశ్నించారు. రియల్టర్లు ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీకి కొమ్ముకాసే నైజం మాను కోవాలన్నారు. సమావేశంలో మాధవి, కమల, వీవీ రంగారెడ్డి, సీపీసీ సత్యం ఉన్నారు.

రిజర్వాయర్ పనులకు నిధులు విడుదల చేయాలి


రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పెద్దిరెడ్డిపల్లి వద్ద నిర్మించనున్న రిజర్వాయర్ పనులకు నిధులు విడుదల చేయాలని రైతుసంఘం, జేవీవీ నాయకులు కోరారు. సోమవారం ఆయా సంఘాలకు చెందిన నాయకులు రిజర్వాయర్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏళ్ల తరబడి పూర్తిస్థాయి నిర్మాణానికి నోచుకోని రిజర్వాయర్‌కు రూ.400 కోట్ల నిధులు అవసరమన్నారు. సాగునీరు అందించి వలసలు నియంత్రించాలన్నారు. అనంతరం రైతులు, ప్రజలతో చర్చించి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ కేవీ శేషారెడ్డి, జేవీవీ రాష్ట్ర నాయకులు డాక్టర్ జీ.సుధాకరరెడ్డి, కె. శ్రీనివాసులురెడ్డి, ఏపీ రైతుసంఘం నాయకులు ఎల్ కృష్ణప్రసాద్, ఉదయగిరి డివిజన్ జేవీవీ నాయకులు దస్తగిరిఅహ్మద్ పాల్గొన్నారు.

రోడ్లు, హద్దు రాళ్ల తొలగింపు


ఎక్స్‌కవేటర్‌తో పనులు చేయిస్తున్న అధికారులు

కావలి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ రోడ్డులోని అనధికారిక లేఅవుట్‌లోని కాలువలు, రోడ్లు, హద్దురాళ్లను సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, టీపీవో వివేకానందలు సిబ్బందితో తొలగింపజేశారు. దాని పక్కన ఉన్న నుడా లేఅవుట్‌లోని ప్రభుత్వ కాలువను ఎక్సకవేటర్‌తో తిరిగి పునరుద్ధరించారు. అనధికార లేఅవుట్ల నిర్మాణాలకు అనుమతులను మున్సిపాలిటీ ఇవ్వదని ఈ విషయాన్ని గమనించాలన్నారు.

ఈ విజయం చంద్రబాబుదే!

● ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీ వైస్‌చైర్మన్ల ఎన్నికల్లో విజయం మనది కాదని, సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదేనని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సోమవారం బుచ్చి నగర పంచాయతీ వైస్ చైర్మన్ల ఎన్నికల అనంతరం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విజయోత్సవ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి నాయకుడు ప్రజా సేవకు పాటుపడాలన్నారు. వైస్ చైర్మన్ల విజయానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో మంచి చేస్తానని హామీ ఇచ్చారు. పదవులు రాని వారు బాధపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డి, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, నూతనంగా ఎన్నికైన వైస్ చైర్మన్లు శివకుమార్‌రెడ్డి, నస్రీన్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, టంగుటూరు మల్లారెడ్డి, ఎంవీ.శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, పక్కన కొత్తగా ఎన్నికైన వైస్ చైర్మన్లు శివకుమార్‌రెడ్డి, నస్రీన్

జొన్నవాడ ఆలయ భూమి స్వాధీనం

● హెచ్చరిక బోర్డు ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరురూరల్,ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): కబ్జాదారుల చేతుల్లో చిక్కుకున్న రూ. కోట్లు విలువైన జొన్నవాడ ఆలయ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి జోలికి వస్తే చట్టప్రకారం చర్యలుంటాయని సోమవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. జొన్నవాడ కూడలి వద్ద కామాక్షితాయి అమ్మవారి ఆలయానికి చెందిన 200 అంకణాల స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించుకుని కట్టడాలు చేపట్టారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి సోమవారం వెలుగులోకి తీసుకువచ్చింది. స్పందించిన దేవదాయశాఖ సదరు స్థలాన్ని పరిశీలించి, తమకు వెంటనే నివేదిక ఇవ్వాలని ఆలయ అధికారులను ఆదేశించింది. దీంతో ఆక్రమణ వాస్తవమేనని తేలడంతో అధికారులు ఆ ప్రాంతం వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. తదుపరి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలుంటాయని వారు పేర్కొన్నారు.



ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన ఆలయ అధికారులు

చంద్రబాబు, పవన్‌కు తొలి కానుక

● రానున్న 'స్థానిక' ఎన్నికల్లోనూ ఇదే పరంపర కొనసాగింపు ● మంత్రి నారాయణ, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, ఫిబ్రవరి 3, (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్వహించిన డిప్యూటీ మేయర్ ఎన్నిక టీడీపీ కైవసం కావడం సంతోషంగా ఉందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే పరంపర కొనసాగుతుందని రాష్ట్ర పురపాలక శాఖామంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయిన తహసీన్‌కు సోమవారం రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ధ్రువీకరణ పత్రాన్ని అందచేశారు. అనంతరం కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్, నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డిలతో కలిసి వారు విలేకరులతో మాట్లాడారు. డిప్యూటీ మేయర్ పదవిని ముస్లింలకు కేటాయించడం సంతోషంగా ఉందని, ఇది ఆ సామాజిక వర్గానికి తాము ఇచ్చిన గుర్తింపేనన్నారు. ఈ విజయాన్ని చంద్రబాబు, పవన్, లోకేశ్‌కు బహుమతిగా అందచేస్తామని వెల్లడించారు. కార్పొరేటర్లు డివిజన్లలోని ప్రజాసమస్యల పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం నారాయణ క్యాంపు కార్యాలయంలోనూ డిప్యూటీ మేయర్ తహసీన్‌ను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అభినందించారు.



డిప్యూటీ మేయర్ తహసీన్‌కు ధ్రువీకరణ పత్రం అందచేస్తున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి

● న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం - ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి

డిప్యూటీ మేయర్ ఎన్నిక నిబంధనల మేరకు జరగలేదని, ఈ విషయంలో తాము న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఎమ్మెల్సీ పీ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఎన్నిక ముగిశాక ఎన్‌ఎంసీ కార్యాలయం బయట విలేకరులతో మాట్లాడారు. వైసీపీ గుర్తుపై గెలిచిన కార్పొరేటర్లు పార్టీ విప్‌జారీ చేసినా ప్రత్యర్థి విజయానికి దోహపడ్డారని అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము అడిగిన ప్రశ్నలకు అధికారులెవరూ సమాధానం కూడా చెప్పలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సర్వేపల్లి సమగ్రాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి సమగ్రాభివృద్ధే లక్ష్యమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పొదలకూరులో రూ20 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్లు, గేట్ సెంటర్‌లోని బాలికల బీసీ హాస్టల్‌లో ఎస్‌ఆర్.శంకరన్ రిసోర్స్ సెంటర్ డిజిటల్ క్లాస్‌రూమ్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో పనులు చేయకుండానే బిల్లులు చేసుకున్నారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఎంతో పారదర్శకంగా పనులు జరుగుతుంటే అవినీతి అని గగ్గోలు పెడుతున్నారన్నారు. నిరంతరం రాష్ట్రం కోసం శ్రమించే మంత్రి నారాయణ గురించి మాట్లాడే అర్హత మాజీ మంత్రి కాకాణికి లేదన్నారు. చిట్టేపల్లి తిప్ప వద్ద ఉన్న మోగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఉపయోగంలోకి తేవాల్సిన బాధ్యత మాపై ఉందన్నారు. సోమశిల దక్షిణ కాలువ పెండింగ్ పనులు పూర్తి చేసి అమ్మవారిపాలెం పెద్ద చెరువు, ప్రభగిరిపట్నం, కందమూరు చెరువుల కింద 4200 ఎకరాలకు నీరు అందిస్తామన్నారు. పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్‌ను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చాం... త్వరలోనే అధికారికంగా ప్రారంభించుకోబోతున్నామన్నారు. పబ్లిక్ పర్పస్ స్థలాలు ఆక్రమిస్తే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, కోవూరు బక్కయ్య నాయుడు, పార్లపల్లి రమేష్‌రెడ్డి, కోడూరు భాస్కర్‌రెడ్డి, దేవినేని శరత్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సోమిరెడ్డిని పూలమాలతో సత్కరిస్తున్న నాయకులు

న్యూస్ బాక్స్

దరఖాస్తుల్లో కుల ధ్రువీకరణ తప్పనిసరి

నెల్లూరురూరల్,ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే వారు కుల ధ్రువీకరణ పత్రాన్ని కచ్చితంగా జతచేయాలని నెల్లూరు రూరల్ ఎక్సైజ్ సీఐ ప్రసన్నలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సప్లిమెంటరీ ఇంటిగ్రేటెడ్ కుల ధ్రువీకరణను తప్పనిసరిగా జతపరచాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు పీడీఎఫ్ పద్ధతిలో దరఖాస్తు చేయాలన్నారు. కల్లుగీత కార్మికులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఆన్‌లైన్ నమోదుకు ఈనెల 5వ తేదీతో గడువు ముగుస్తుందన్నారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పొదలకూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని, పొదలకూరు, రాపూరు, చేజర్ల, సైదాపురం మండలాల గీత కార్మికులు జిల్లాలో గీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకోవచ్చని పొదలకూరు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ వీ.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ దరఖాస్తు దారులు కులం సర్టిఫికెట్‌తో పాటు సబ్‌కులంతో సంబంధిత తహసీల్దారు వద్ద నుంచి సర్టిఫికెట్, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ తప్పనిసరిగా జత చేయాలని తెలిపారు. దరఖాస్తు ఫీజు రూ.2లక్షలు (నాన్‌రిఫండబుల్), చెల్లించాలన్నారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో ఏ షాపునకైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9440902520ను సంప్రదించాలన్నారు.

జడ్పీ పాఠశాలకు రూ.30వేల వితరణ

పొదలకూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పొదలకూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు ఏవీ సుధాకర్ తనకు ప్రభుత్వం అందజేసిన రూ.20వేల పారితోషకం చెక్కుతో పాటు తన సొంత నిధులు మరో రూ.10వేలు కలిపి మొత్తం రూ.30వేలు వితరణ చేశారు. ఈ చెక్కును సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేతుల మీదుగా విద్యా కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఉపాధ్యాయుడు సుధాకర్ మాట్లాడుతూ తన తల్లి అత్తివరం వెంకమ్మ జ్ఞాపకార్థం పాఠశాల శాశ్వత నిధి ఏర్పాటు చేసి, వచ్చే వడ్డీతో సుమారు (రూ.2వేలు) బాలుర ఉన్నత పాఠశాలలో ప్రతి ఏటా పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి ఆగస్టు 15వ తేదీన నగదు ప్రోత్సాహకాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. పారితోషికం అందించడం పట్ల సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సుధాకర్‌ను అభినందించారు.

విద్యార్థుల మధ్యాహ్న భోజనానికి వితరణ

రాపూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకానికి రాపూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఏదోటి కోటినాయుడు సుమారు రూ.10వేల విలువగల బియ్యం, కూరగాయలు, వస్తువులు సోమవారం అందచేశారు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ వి హనుమంతయ్య ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

పీజీఆర్‌ఎస్‌కు అధికారులు రాకపోతే ఎలా?

విడవలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమానికి కొందరు అధికారులు హాజరు కాకపోవడం పట్ల విడవలూరుకు చెందిన టీడీపీ నాయకుడు పొన్నలూరు పురంధర్‌రెడ్డి అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దారు చంద్రశేఖర్‌కి అధికారులపై ఫిర్యాదు చేశారు. అయన మాట్లాడుతూ తహసీల్దారు కార్యాలయంలో జరిగిన పీజీఆర్‌ఎస్‌కు వ్యవసాయ, ఐసీడీఎస్ శాఖలకు చెందిన అధికారులు మాత్రమే హాజరు కాగా మిగిలిన శాఖలకు చెందిన ఏ ఒక్క అధికారి కూడా రాలేదన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంపీడీవోని సన్మానించిన జనసేన నేతలు

విడవలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విడవలూరు ఎంపీడీవో నగేష్‌కుమారిని మండలానికి చెందిన జనసేన నాయకులు మద్దాలి మల్లికార్జున, బత్రి శ్రీనివాసులు, గుర్రైపాటి శ్రీకాంత్‌లు సోమవారం మర్యాదు పూర్వకంగా కలసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీడీవో జిల్లా కలెక్టరు చేతుల మీదుగా ప్రశంసాపత్రం తీసుకోవడం సంతోషకంగా ఉందన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి పేదవానికి అందేలా చూడాలన్నారు.

సరస్వతీదేవిగా రాజరాజేశ్వరి

● పలు ఆలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సందర్భంగా సోమవారం రాజరాజేశ్వరి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు రఘునాథశర్మ, వేద పండితులు రామకృష్ణ ఆధ్వర్యంలో సరస్వతీ హోమం, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాన్ని దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి సామూహిక అక్షరాభ్యాసాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పలకలు, పుస్తకాలు, పెన్నులు, బలపాలు పంపిణీ చేశారు. భక్తులకు రవ్వలడ్డూలు ప్రసాదంగా వితరణ చేశారు.

● ఇరుగాళమ్మ ఆలయంలో..

నగరంలోని ఇరుగాళమ్మ ఆలయంలో వసంత పంచమి వేడుకలు తొలిసారిగా జరిగాయి. ఆలయ చైర్మన్ ఒట్లూరు సురేంద్రయాదవ్, ఈవో గిరికృష్ణ ఆధ్వర్యంలో గణపతి పూజ, సామూహిక లలితా పారాయణం, సహస్ర నామ పారాయణం, సరస్వతీదేవి సహస్ర నామార్చన జరిగాయి. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే సతీమణి విజితమ్మ, మాజీ మేయర్ భానుశ్రీ అతిథులుగా పాల్గొన్నారు. ప్రధాన అర్చకుడు చంద్రశేఖరస్వామి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

● కన్యకాపరమేశ్వరి ఆలయంలో...

స్టోన్‌హౌస్‌పేట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సరస్వతీదేవికి విశేష పూజలు జరిగాయి. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు పేగు షణ్ముఖరావు, గౌరవాధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, పాలక మండలి కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ఒమ్మిన జనార్దన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

● మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీదేవికి అభిషేకాలు, అలంకారం, పూజలు సరస్వతీహోమం, సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి.

● అష్టలక్ష్మీ ఆలయంలో...

నగరంలోని సుజాతమ్మనగర్ అష్టలక్ష్మి ఆలయంలో దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ, ఉత్తర పీఠాధిపతి దత్త విజయానంద తీర్థ స్వామీజీలు శ్రీచక్రార్చన, సరస్వతీ పూజ, హోమం, నాగేశ్వరస్వామికి రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. పలకలు, నోటుపుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు పర్యవేక్షించారు.





సరస్వతీ అలంకారంలో ఇరుకళల పరమేశ్వరి, అక్షరాభ్యాసం చేయిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామీజీ

యువతలో నైపుణ్యాలను గుర్తించండి

నెల్లూరు (సిటీ), ఫిబ్రవరి 3, (ఆంధ్రజ్యోతి): నగరంలోని యువతలో నైపుణ్యాలను గుర్తించి, వారి ఆర్థి కాభివృద్ధికి దోహదపడాలని ఎన్‌ఎంసీ కమిషనర్ సూర్యతేజ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో పరిపాలన, పట్టణ అభివృద్ధి, మెప్మా, సీ-క్లాప్ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నైపుణ్యం కలిగిన యువతను గుర్తించాలన్నారు. వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇవ్వాలన్నారు. అనంతరం పలు సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో అర్బన్ లైవ్లీ హుడ్ మిషన్ అధికారి షాబుద్దీన్, మెప్మా పీడీ రాధ మ్మ, ఎస్‌ఈ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూర్యతేజ

రాష్ట్ర తైక్వాండో పోటీల్లో జిల్లాకు పతకాలు

నెల్లూరు(విద్య), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించారు. కాకినాడలోని జేఎన్‌టీయూ ఇండోర్ స్టేడియంలో జనవరి 31 నుంచి ఈనెల 2 వరకు జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో నెల్లూరు క్రీడాకారులు 11 మంది వివిధ విభాగాల్లో పతకాలు సొంతం చేసుకున్నారు. వీరిలో చాముండేశ్వరనాథ్ బంగారు, అఖిల్‌రెడ్డి, గౌతమ్, హిమశ్రీ, తన్వి, జోలేంద్రప్రసాద్, గౌతమ్‌బాబు, రేవంత్, కుషాల్, మిధున్, చైత్రలు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారని కోచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన క్రీడాకారులకు తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు మనీష, ఉపాధ్యక్షుడు ముఖేష్, కార్యదర్శి అకిల్ తదితరులు సోమవారం అభినందనలు తెలిపారు.



పతకాలు సాధించిన క్రీడాకారులు

అటల్ పెన్షన్ యోజనతో జిల్లాకు ప్రయోజనమేమిటి?

● పార్లమెంటులో వేమిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అటల్ పెన్షన్ యోజన వల్ల నెల్లూరు జిల్లాకి కలుగుతున్న ప్రయోజనం ఏమిటని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోమవారం పార్లమెంటులో ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి పంకజ్‌చౌదరి సమాధానమిస్తూ నెల్లూరు జిల్లాలో ఈ పథకం కింద 1,77,490 మంది లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. స్త్రైవ్ పథకం గురించి అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి సమాధానం ఇస్తూ నెల్లూరులో రెండు ఐటీఐలు ఉన్నాయని, అందులో ఒక్కో దానికి రూ.1.43కోట్లు కేటాయించగా, తడ ఐటీఐకి రూ.1.23కోట్లు అందించామని తెలిపారు. వాటిలోని వివిధ ట్రేడ్లలో తాజా ఉపకరణాలు, యంత్రాల సేకరణ కోసం ఈ నిధులను వినియోగించాలని తెలిపారు.

చాక్లెట్లతో రథం



చాక్లెట్లతో రూపొందించిన సూక్ష్మరథం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని భక్తవత్సలనగర్‌కి చెందిన కార్పెంటర్ ఎం.శ్రీనివాసులు రథసప్తమి సందర్భంగా చాక్లెట్లతో సూక్ష్మ రథాన్ని రూపొందించారు. జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎం.పూజిత అక్షరాలతో సూక్ష్మరథాన్ని చిత్రీకరించారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళిక : గిరిధర్

నెల్లూరురూరల్,ఫిబ్రవరి3 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని కనుజులమిట్ట, శ్రీరామకాలనీ, మొగళ్లపాళెం ప్రాంతాల్లోని గిరిజనుల అభివృద్ధికి ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. గడప గడపకు.. కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా ప్రాంతాల అవసరాలను గుర్తించి వాటిని ఏర్పాటు చేసేందుకు నిధులను సమీకరిస్తున్నట్లు తెలిపారు. సీసీరోడ్లు, డ్రైన్లు, శ్మశానవాటికల రక్షణగోడలు, పాఠశాలలకు ప్రహరీ గోడలు తదితర అవసరాలకు తగ్గట్టు నిర్మాణాలు చేపట్టేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

కేన్సర్ పేషెంట్‌కు మంత్రి నారాయణ చేయూత

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కుసుమ హరిజనవాడకు చెందిన టీడీపీ సీనియర్ నాయకురాలు సీహెచ్ మంగమ్మ ఇటీవల కేన్సర్ బారిన పడి, అనారోగ్యానికి గురయ్యారు. దీంతో సోమవారం రాష్ట్ర పురపాలక శాఖామంత్రి డాక్టర్ పీ నారాయణ, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మంగమ్మ అనారోగ్యానికి గురికావడం బాధ కలిగించిందన్నారు. ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మంగమ్మ వైద్యానికయ్యే ఖర్చు మొత్తాన్ని తాను భరిస్తానని నారాయణ హామీ ఇచ్చారు. ఆమె కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు.



బాధితురాలి కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మంత్రి నారాయణ

నేడు వరదరాజస్వామి ఆలయంలో పూజలు

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రథసప్తమి పర్వదినం సందర్భంగా మంగళవారం మండలంలోని జొన్నవాడలో కొలువైవున్న వరదరాజస్వామి శ్రీదేవి, భూదేవి సమేతుడుగా గ్రామోత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. ముందుగా ఆలయంలో స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు జరగనున్నాయి.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

ఇందుకూరుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లిపాడు ఇసుక రీచ్‌లో అక్రమ ఇసుక రవాణా బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దారు కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యంత్రాలతో ఇసుకను తవ్వి అక్రమంగా తరలిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దువ్వూరు రామ్మోహన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, వెంకట్రావు, శివప్రసాద్, అనిల్‌కుమార్, వెంకటశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

దోర్నాల హరిబాబుకు సన్మానం

నెల్లూరు (సాంస్కృతికం), ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): హాస్య నటుడు దోర్నాల హరిబాబు ఇటీవల దివంగత సినీ నటుడు కృష్ణంరాజు ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం నగరంలోని ఏసీ స్టేడియం వాకర్స్ కమిటీ ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నేత రఘురాం ముదిరాజ్, నగర కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు రంగారావు, వాకర్స్ కమిటీ అధ్యక్షుడు సత్యం తదితరులు మాట్లాడారు. ఏసీ స్టేడియం వాకర్స్ కమిటీ కార్యదర్శి స్నేహ సురేష్, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



దోర్నాల హరిబాబును సన్మానిస్తున్న ఏసీ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

పుస్తక ప్రదర్శన సందర్శనకు 15 వేల మంది

● రూ.9.50లక్షల విలువైన పుస్తకాల విక్రయం ● ముగిసిన మహోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వీఆర్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన సింహపురి పుస్తక ప్రదర్శన సోమవారం ముగిసింది. జనవరి 28న ప్రారంభమైన ఈ ప్రదర్శనను సుమారు 15వేల మందికిపైగా పుస్తక ప్రియులు తిలకించారు. రూ.9.50లక్షల విలువ చేసే పుస్తకాలను కొనుగోలు చేశారు. ఈ పుస్తక మహోత్సవాన్ని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ముగింపులో సొసైటీ అధ్యక్షుడు లక్ష్మయ్య మాట్లాడుతూ తాము ఊహించని దానికన్నా పుస్తకాల విక్రయాలు మూడింతలు పెరిగాయని పేర్కొన్నారు.

మా పోటీ టీడీపీపై కాదు.. న్యాయం, అన్యాయం మధ్య

● మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మా పోటీ టీడీపీపై కాదని, న్యాయం.. అన్యాయం మధ్య అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలసి కాకాణి మాట్లాడుతూ టీడీపీలోకి వెళ్లిన కౌన్సిలర్లు మా పార్టీ వాళ్లే కానీ మావాళ్లు కాదన్నారు. విప్ ధిక్కరించిన వారిపై జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో నాయకులు వీరి చలపతిరావు, నిరంజన్‌బాబురెడ్డి, విజయకుమార్, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.


మా ఊర్లో బడిని మార్చొద్దు

● అధికారులకు గ్రామస్థుల వినతి

మనుబోలు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను మార్చవద్దంటూ కుడితిపల్లి గ్రామస్థులు జట్లకొండూరు టీడీపీ నేత వెందోటి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమ వారం ఎంపీడీవో జలజాక్షికి, ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రాలు అందజేశారు. గ్రామస్థులు మాట్లాడుతూ తమ గ్రామంలో ఉన్న బడిలో 35 మంది పిల్లలు ఉన్నారన్నారు. వచ్చే ఏడాది నుంచి ఈ బడి తీసేస్తారని తెలిసిందన్నారు. అలా చేస్తే రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చెర్లోపల్లి పాఠశాలకు వెళ్లాల్సి వస్తుందని, దానితో పిల్లలు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే 117 జీవో ఉపసంహరించుకుని తమ గ్రామంలో ఉన్న పాఠశాలను అలానే ఉంచాలన్నారు.



పాఠశాలను మార్చవద్దని వినతిపత్రం ఇస్తున్న కుడితిపల్లి గ్రామస్థులు




రథసప్తమి వేడుకల ఏర్పాట్లతో తిరుమల కొండ జగజ్జగేయమానంగా వెలిగిపోతోంది. విద్యుత్ దీపతోరణాలు, పూల అలకంకరణలు కనువిందుగా ఉన్నాయి. మంగళవారం ఉదయం 5.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ఏడు వాహనాలపై శ్రీవారు ఊరేగనున్నారు. అందుకే ఒకరోజు బ్రహ్మోత్సవం, అర్థబ్రహ్మోత్సవం అని ఈ వేడుకను పిలుస్తారు. ఈ రోజున మాడవీధుల్లో ఊరేగే స్వామిని దర్శించుకుంటే, బ్రహ్మోత్సవాల తొమ్మిదిరోజుల వాహనసేవలను తిలకించినంత భాగ్యం దక్కుతుందని భావించి లక్షల సంఖ్యలో భక్తులు రథసప్తమికి తిరుమలకు చేరుకుంటారు.

వైకుంఠ ఏకాదశి టోకెన్ల తొక్కిసలాట ఘటన నేపథ్యంలో తిరుమలలో పటిష్ట ఏర్పాట్లను టీటీడీ చేసింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వాహనసేవలు ఇలా..

ఉదయం 5.30 - 8: సూర్యప్రభ వాహనం
(6.44 గంటలకు సూర్యోదయం)
9 - 10: చిన్నశేష వాహనం
11 - 12: గరుడ వాహనం
మధ్యాహ్నం 1 - 2: హనుమంత వాహనం
2 - 3: చక్రస్నానం
4 - 5: కల్పవృక్ష వాహనం
6 - 7: సర్వభూపాల వాహనం
రాత్రి 8 - 9: చంద్రప్రభ వాహనం







నేడు సప్తవాహన సవారీ

- రథసప్తమికి ముస్తాబైన తిరుమల
- భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి

- ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో మాడవీధుల్లో తాత్కాలిక షెడ్లు నిర్మించారు.
- మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు.
- గతేడాది రథసప్తమికి 650 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తే ఈసారి ఈ సంఖ్యను 1,300కి పెంచారు. మరో వెయ్యి మంది విజిలెన్స్ సిబ్బంది కూడా విధుల్లో ఉంటారు.
- మూడు వేల మంది శ్రీవారిసేవకులు కూడా ఉదయం నుంచి రాత్రి వరకు గ్యాలరీల్లో ఉండే భక్తులకు సేవలు అందిస్తారు.
- 500 మంది టీటీడీ అధికారులు, ఉద్యోగులు గ్యాలరీల వద్ద విధుల్లో ఉంటారు.
- తొమ్మిది టన్నుల పూలతో అలంకరణలు చేపట్టారు. శ్రీవారి ఆలయంలో 3 టన్నులు, వెలుపల 6 టన్నులు వినియోగించారు.
- 30 వేల కట్‌ఫ్లవర్స్‌లో ఆలయంలోని పలు ప్రదేశాలను సౌందర్యవంతంగా తీర్చిదిద్దారు. ఆలయం ముందున్న బయోమెట్రిక్ వద్ద 10 వేల కట్‌ఫ్లవర్స్‌తో దశావతారాల సెట్టింగ్ చేశారు.

నిండిన ఉత్తరమాడవీధి

సోమవారం సాయంత్రానికే ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం 4 గంటల నుంచే మాడవీధుల్లోని గ్యాలరీల్లోకి చేరుకుంటున్నారు. సూర్యకిరణాలు స్వామిని తాకే దాకా శుక్రవారం వేకువజాము నుంచి సూర్యప్రభవాహనాన్ని వాయువ్య దిక్కులో ఉంచుతారు. దీంతో ఉత్తరమాడవీధుల్లోని గ్యాలరీలన్నీ సోమవారం రాత్రికే నిండిపోయాయి.

..ఈ దర్శనాలన్నీ రద్దు

రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శన టోకెన్ల జారీని సోమ, మంగళ, బుధవారాల్లో టీటీడీ రద్దు చేసింది. అలాగే మంగళవారం వీఐపీ బ్రేక్, ఆర్జితసేవలు, వృద్ధులు, దివ్యాంగులు తదితర ప్రత్యేక దర్శనాలను రద్దు చేసినట్టు టీటీడీ స్పష్టం చేసింది. అలాగే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి రావాలని, లేనిపక్షంలో సర్వదర్శన క్యూలైన్ ద్వారానే స్వామిని దర్శించుకోవాల్సి ఉంటుందని టీటీడీ తెలిపింది.


బందోబస్తుపై పోలీసులు, విజిలెన్సు అధికారులతో చర్చిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

3 లక్షల మంది రావొచ్చు

- భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యం
- టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): రథసప్తమి సందర్భంగా మంగళవారం ఉదయం 5.30 నుంచి రాత్రి 9 గంటలకు ఏడు ప్రధాన వాహనాలపై ఊరేగే స్వామిని దర్శించుకునేందుకు రెండు నుంచి మూడు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని ఈవో శ్యామలరావు తెలిపారు. ఈసందర్భంగా చేసిన ఏర్పాట్లను అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇంచార్జ్ సీవీఎస్వో మణికంఠ, వివిధ విభాగాల అధికారులతో కలిసి ఈవో సోమవారం పరిశీలించారు. తిరుమలలో భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేశామంటూ, భక్తుల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చామని ఈవో మీడియాకు తెలిపారు. గతేడాది కంటే రెండు రెట్లు అధికంగా బందోబస్తు ఏర్పాటు చేసినట్టు వివరించారు. మెడికల్ సిబ్బందితో పాటు అంబులెన్స్‌లు కూడా సిద్ధం చేశామన్నారు. సీసీ కెమెరాల నిఘాతో కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. దీనికి తగినట్టు భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. గ్యాలరీల్లో అన్నప్రసాదం పంపిణీ, తాగునీరు, మరుగుదొడ్లు, షెడ్లు వంటి సౌకర్యాలను ఈవో, ఇతర అధికారులు తనిఖీ చేశారు. కొంతమంది భక్తులతో నేరుగా మాట్లాడారు.

అలిపిరి కాలినడక మార్గంలో తనిఖీలు

అలాగే ఈవో శ్యామలరావు అలిపిరి కాలినడకమార్గంలోని మోకాళ్లమిట్ట వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మరుగుదొడ్లను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అక్కడున్న సిబ్బందిని ఆదేశించారు. అంతకు ముందు తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ నిత్యాన్నప్రసాద భవనంలోనూ ఈవో తనిఖీలు చేశారు. అన్నప్రసాదాల నాణ్యతపై భక్తులతో నేరుగా మాట్లాడారు. తాను కూడా భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు.


ఎస్వీయూ ఏడీ భవనం ముందు మేయర్ శిరీష, వైసీపీ కార్పొరేటర్లు


ఎస్వీయూ మెయిన్ గేటు వద్ద వైసీపీ కార్పొరేటర్ల బస్సు వచ్చే సమయంలో రెండు వర్గాలు గుమికూడటంతో నెలకొన్న ఉద్రిక్తత

- కోరం లేకపోవడంతో అధికారుల నిర్ణయం
- ఎస్వీయూ వద్ద ఉద్రిక్తత
- మా కార్పొరేటర్లను కిడ్నాప్ చేశారంటూ వైసీపీ ఆందోళన
- అలాంటిదేమీ లేదంటూ సభ్యుల ప్రకటన

డిప్యూటీ మేయర్ ఎన్నిక

నేటికి వాయిదా


సెనేట్ హాలులోపల ఎన్నికల అధికారి శుభం బన్సల్, ఎమ్మెల్యే ఆరణి, కూటమి మద్దతుదారు కార్పొరేటర్లు

మమ్మల్ని ఎవరూ కిడ్నాప్ చేయలేదు

కూటమి నేతలు తమని కిడ్నాప్ చేశారని వస్తున్న వార్తల్లో నిజంలేదని, తామంతా సురక్షితంగా ఉన్నామని కార్పొరేటర్లు అమరనాథరెడ్డి, అనీష్ రాయల్, అనిల్, మోహన్ కృష్ణ యాదవ్ తెలిపారు. తమ కార్పొరేటర్లపై దాడి చేసి కిడ్నాప్ చేశారన్న వైసీపీ నేతల ఆరోపణలపై వీరు సెల్ఫీ వీడియోల ద్వారా స్పందించారు. ఎన్నికకు వెళుతున్న సమయంలో జరిగిన ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భయపడి తాము సురక్షితంగా ఉన్నామన్నారు. ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

తిరుపతి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అనేక నాటకీయ పరిణామాలకు తెరలేపిన తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నిక తీవ్ర ఉత్కంఠను రేపుతోంది. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 11 గంటలకు ఎన్నిక జరగాలి. అందుకు ఎస్వీయూ సెనేట్ హాలులో ప్రిసైడింగ్ అధికారి శుభం బన్సల్ ఏర్పాట్లు పూర్తి చేశారు. కానీ, కోరం లేకపోవడంతో ఎన్నికను మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి, జేసీ శుభం బన్సల్ ప్రకటించారు. 47 మంది కార్పొరేటర్లు, 3 ఎక్స్‌అఫిషియో సభ్యులున్నారు. 22 మంది మాత్రమే ఎన్నికకు హాజరయ్యారు. 50 శాతం కోరం లేకపోవడంతో ఎన్నిక వాయిదా అనివార్యమైంది.

హాలులో 22 మంది

ఎస్వీయూ సెనేట్ హాలులోకి సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో వైసీపీ రెబల్ కార్పొరేటర్లతో పాటు కూటమి డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ, మరికొందరు వచ్చారు. అరగంట తర్వాత ఎక్స్‌అఫిషియో సభ్యుడు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రావడంతో మొత్తం 22 మంది సభ్యులు ఎన్నికకోసం వేచిచూశారు.

గేటు బయట టెన్షన్

భూమన కరుణాకర్‌రెడ్డి ఇంటి నుంచి 23 మంది వైసీపీ కార్పొరేటర్లతో బస్సు బయలుదేరగా.. ఎక్స్‌అఫిషియో సభ్యులైన ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కూడా వచ్చారు. ఎస్వీయూ మెయిన్ గేటు సమీపంలోకి వచ్చేసరికి అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇరువర్గాల వాళ్లు పెద్దసంఖ్యలో మోహరించారు. ఇంతలో బస్సు డోరు అద్దాలు పగిలాయి. ఈ గొడవలో ఐదుగురు కార్పొరేటర్లు బస్సు దిగి వెళ్లిపోయారు. ఘటనాస్థలికి చేరుకున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.వైసీపీ కార్పొరేటర్లను ఎస్వీయూ మెయిన్ గేటునుంచి లోపలకు వెళ్లే ఏర్పాట్లు చేశారు. 17 మంది గేటు లోపలకు వెళ్లారు. మరో ఇద్దరు గైర్హాజరు కాగా, ఓ మహిళా కార్పొరేటర్ అస్వస్థతతో వెనుదిరిగారు.

భూమన ఫోనుతో యూటర్న్

మరికొద్ది క్షణాల్లో వైసీపీ కార్పొరేటర్లు సెనేట్ హాలుకు చేరుకోబోతుండగా ఎంపీ గురుమూర్తికి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ఫోను చేశారు. ఆ వెంటనే వైసీపీ కార్పొరేటర్లతో కలిసి ఆయన వెనుదిరిగారు. ఓటింగుకు హాజరైతే సంఖ్యాబలం ప్రత్యర్థులకే ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. తమ కార్పొరేటర్లను బలవంతంగా లాక్కెళ్లారని ఆరోపిస్తూ ఎన్నికను బహిష్కరిస్తే కోరం లేక వాయిదా పడుతుందని భూమన దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. దీంతో ఎంపీ, ఎమ్మెల్సీ, మేయర్ ఇతర కార్పొరేటర్లు వెనక్కి వచ్చి ఏడీ బిల్డింగ్ సర్కిల్ సమీపంలో ఫుట్‌పాత్‌పై కూర్చున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం 11 నుంచి 12 గంటల్లోపు ఎన్నిక జరగాలి. మరికొంత సమయం కావాలని డిప్యూటీ మేయర్ అభ్యర్థి ఆర్సీ మునికృష్ణ పలుసార్లు అభ్యర్థించారు. కోరం లేకపోతే నిబంధనల మేరకు గంట సమయం మాత్రమే ఉంటుందని, వాయిదా వేస్తున్నట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు.

తిరుపతి నగరంలో 144 సెక్షన్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియ పూర్తయ్యే వరకు తిరుపతి నగరంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం తెలిపారు. అదనపు బలగాలతో బందోబస్తుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎస్వీయూ మెయిన్ గేటు వద్ద ఉద్రిక్తత

- పోలీసులపై ఎస్పీ ఆగ్రహం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ మేయర్ ఎన్నిక నేపథ్యంలో ఎస్వీయూ మెయిన్ గేటు వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఉదయం 9.30 గంటలకు వైసీపీ శ్రేణులు యూనివర్శిటీ ప్రధాన రోడ్డు వద్ద ఆందోళన చేపట్టడంతో పోలీసులు చెదరగొట్టారు. వర్సిటీ వద్ద 144 సెక్షన్, 30 పోలీసు యాక్టు ఉన్నా వైసీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. అదే సమయంలో కూటమి నాయకులు, కార్పొరేటర్లు రావడంతో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు బాలాజీ కాలనీ నుంచి వర్సిటీ ఫ్లై ఓవర్ వరకు ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. అదే సమయంలో వైసీపీ కార్పొరేటర్ల బస్సు రావడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులను సైతం లెక్క చేయకుండా వర్సిటీ వైపు చొచ్చుకుని రావడానికి ప్రయత్నించారు. అక్కడే ఉన్న ఎస్పీ హర్షవర్ధనరాజు ఆందోళనకారులను చెదరగొట్టారు. పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.



ఇరువర్గాలను చెదరగొట్టాక బస్సును లోపలకు పంపుతున్న ఎస్పీ

వర్సిటీ రోడ్డుపైకి భారీ సంఖ్యలో ఆందోళనకారులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు చొచ్చుకుని వస్తున్నా నియంత్రించకపోవడంపై తిరుపతి ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీలత, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ గిరిధర్, ప్రధాన గేటు వద్ద విధుల్లో వున్న ఇద్దరు పోలీసు అధికారులపై ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్యూటీలు చేయడానికి వచ్చారా? జాతరను చూడడానికి వచ్చారా అని అసహనం వ్యక్తంచేశారు. విధులు సక్రమంగా చేయకుంటే వెళ్లండంటూ ఆగ్రహించారు. పోలీసులు ఎంత కఠినంగా విధులు నిర్వహిస్తే అంత భయం ఉంటుందనే విషయాన్ని మరచిపోకూడదన్నారు.

బస్సు అద్దాల ధ్వంసంపై కేసు

ఎస్వీయూ వర్సిటీ వద్ద వైసీపీ కార్పొరేటర్లు వస్తున్న బస్సు డోరు అద్దాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటనలో నారాయణవనం ఎస్ఐ రాజశేఖర్ ఫిర్యాదు మేరకు వర్సిటీ సీఐ రామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్పొరేటర్లకు కునుకేదీ?

డిప్యూటీ మేయర్ ఎన్నిక కార్పొరేటర్లకు కునుకులేకుండా చేస్తోంది. ముఖ్యంగా కొత్త మహిళా కార్పొరేటర్లు అసహనంగా నలిగిపోతున్నారు. క్యాంపు రాజకీయాల్లో భాగంగా పలు చోట్ల హోటళ్లలో బస చేస్తున్న చోట్లకు అటు కూటమి.. ఇటు వైసీపీ నేతలు పోటాపోటీగా చేరుకున్నారు. అర్ధరాత్రి వేళ వారిని నిద్రలేపి చిన్నపిల్లలున్నా పట్టించుకోకుండా నానా యాగీ చేశారు. సోమవారం ఎన్నికకు ముగింపు కార్డు పడుతుందనుకునేలోపు మళ్లీ వాయిదాపడడంతో వీరంతా నోరెళ్లబెట్టారు. మళ్లీ ఎవరి దారిన వారు క్యాంపులకు పయనమయ్యారు.

కార్పొరేటర్లు వెళ్లే బస్సుకు భద్రత కల్పించండి

- తిరుపతి ఎస్పీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): తిరుపతి డిప్యూటీ మేయర్ ఎన్నికను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘం, డీజీపీ, జిల్లా ఎస్పీని ఆదేశించాలని కోరుతూ వైసీపీ జనరల్ సెక్రటరీ లేళ్ల అప్పిరెడ్డి, 40వ వార్డు కార్పొరేటర్ టి.భాస్కర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని అభ్యర్థించారు. పిటిషన్‌ను లంచ్‌మోషన్‌గా స్వీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వడ్డిబోయిన సుజాత.. ఎస్వీయూలోని సెనేట్ హాల్‌కు వెళ్లేందుకు కార్పొరేటర్లు వినియోగించే బస్సుకు పోలీసు భద్రత కల్పించాలని ఎస్పీని ఆదేశించారు. భద్రత కల్పించాలని కోరుతూ ఎస్పీకి సమర్పించే వినతిపై ఆ బస్సులో ప్రయాణించే కార్పొరేటర్ల సంతకాలు ఉండాలని స్పష్టం చేశారు. అంతకుముందు పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ... డిప్యూటీ మేయర్ ఎన్నికకు వెళ్లే సమయంలో వైసీపీకి చెందిన కార్పొరేటర్లపై అధికార పార్టీ నాయకులు దాడికి పాల్పడే ప్రమాదం ఉందన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేపటి నుంచి 147 కేంద్రాల్లో ఇంటర్ ప్రాక్టికల్స్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 147 కేంద్రాల్లో బుధవారం నుంచి 20వ తేదీ వరకు జనరల్, ఒకేషనల్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఈ ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణపై సోమవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఉదయం 9 నుంచి 12 వరకు.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు.. రెండు విడతల్లో ప్రాక్టికల్స్ జరుగుతాయన్నారు. జనరల్ 24,927మంది విద్యార్థులకు 124 పరీక్షాకేంద్రాలు.. ఒకేషనల్ 2,355 మందికి 23 కేంద్రాల్లో ఈ పరీక్షలు ఉంటాయన్నారు. ఉదయం 8.45 గంటలకంతా విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను అనుమతించేది లేదన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో నరసింహులు, ఆర్ఐవో ప్రభాకర్‌రెడ్డి, డీఈవో కేవీఎన్ కుమార్, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ప్రాణం మీదకొచ్చిన పట్టాలపై నడక

- రైలు రావడంతో నీళ్లలోకి దూకేసిన యువకులు
- ఒకరి మృతి



మృతి చెందిన యలరాజు

తడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సరదగా పట్టాలపై నడిచివెళ్తుండగా అకస్మాత్తుగా రైలు రావడంతో బిత్తరపోయిన ఇద్దరు యువకులు నీళ్లలోకి దూకగా.. ఒకరు మృతి చెందారు. ఈ ఘటన తడ మండలం అక్కంపేట రైల్వేస్టేషన్ వద్ద జరిగింది. అనంతపురానికి చెందిన భానుశంకర్, అదే జిల్లాలోని నందికొట్టుకూరుకు చెందిన వడ్డే యలరాజు(20) ప్రకాశం జిల్లా మార్కాపురంలో డిప్లొమా మూడో సంవత్సరం చదువుతున్నారు. ఇండస్ట్రియల్ ట్రైనింగ్‌లో భాగంగా శ్రీసిటీ సెజ్‌లోని హెవెల్స్ పరిశ్రమలో 3 నెలల నుంచి శిక్షణ తీసుకుంటున్నారు. తడ మండలం అక్కంపేట వద్ద అద్దె ఇంట్లో ఉంటున్నారు. సోమవారం సాయంత్రం రైలు పట్టాలపై నడిచివెళ్తూ పాములకాలువ బ్రిడ్జిపైకి చేరుకున్నారు. అదే సమయంలో సూళ్లూరుపేట నుంచి చెన్నై వైపు వెళ్లే మెమో రైలు రావడంతో కంగారుపడ్డ ఇద్దరూ పట్టాలపై నుంచి కాలువలో దూకేశారు. వీరిలో భానుశంకర్ ఒడ్డుకు చేరుకున్నారు. నీట మునిగిన యలరాజును స్థానికులు బయటకు తీసుకొచ్చి సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. రైల్వే జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇక బాజాభజంత్రీల మోత

- మొదలైన ముహూర్తాలు
- బుక్ అయిన కల్యాణ మండపాలు
- ఎటుచూసినా పెళ్లిళ్ల సందడే

- 6లో



ప్రయాగ్‌రాజ్‌లో ఊంజల్‌సేవ



ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళా సందర్భంగా టీటీడీ ఏర్పాటు చేసిన శ్రీవారి నమూనా ఆలయంలో సోమవారం వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీనివాసస్వామికి ప్రత్యేక ఊంజల్‌సేవను నిర్వహించారు. స్వామివారు వీణాపాణియై సరస్వతి అలంకారంలో ఊయలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు అన్నమయ్య సంకీర్తలను ఆలపించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో వార్షిక విశేషపూజ



తిరుమల శ్రీవారి ఆలయంలో వార్షిక విశేషపూజను సోమవారం వసంతపంచమి పర్వదినం సందర్భంగా నిర్వహించారు. గతంలో వారపుసేవగా విశేషపూజను నిర్వహించేవారు. అయితే శ్రీవారి ఉత్సవమూర్తుల అరుగుదలను అరికట్టేందుకు ఏడాదికోసారి మాత్రమే అభిషేకం నిర్వహించాలనే సూచనతో దీనితోపాటూ వసంతోత్సవం, సహస్ర కలశాభిషేకంలను వార్షిక సేవలుగా గత టీటీడీ బోర్డు నిర్ణయించింది. ఈమేరకు తొలిసారి వార్షి విశేషపూజను సోమవారం శ్రీవారి ఆలయంలోని కల్యాణమండపంలో నిర్వహించారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో లోకనాథం ఈపూజలో పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

పెరిగిన రద్దీ

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లలో, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.


శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.34 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,706

తలనీలాలు సమర్పించినవారు: 23,340



ఇక బాజాభజంత్రీల మోత



- ప్రవేశించిన మాఘమాసం
- ఈనెల 2 నుంచి సుముహూర్తాలు
- బుక్ అయిపోయిన కల్యాణ మండపాలు
- మొదలైన పెళ్లి సందడి

మాఘమాసం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూడనక్కరలేదు. నవ వధూవరులు పెళ్లి పీటలెక్కేందుకు రోజులు లెక్కపెట్టనక్కరలేదు. మాఘమాసం వచ్చేసింది. సుమూహూర్తాల మూటను మోసుకొచ్చేసింది. నిశ్చితార్థమయిన వారి ఇంట పెళ్లి సందడి తెచ్చేసింది. ఉత్తరాయణ పుణ్యకాలంలో వచ్చే ఈమాసానికి ఎంతో ప్రాధాన్యముందని ప్రగాఢంగా ప్రజలు విశ్వసిస్తారు. అందుకే మాఘమాసం వివాహాది శుభకార్యాలకు పెట్టింది పేరు. పెళ్లిళ్లు, అక్షరాభ్యాసాలు, నామకరణాలు లాంటివి ఈరోజుల్లోనే చేసేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తుంటారు. పెళ్లిళ్లయితే అన్నీ ఇన్నీ కాదు. ఈ సారి కూడా తిరుపతి నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా పెళ్లిళ్ల సంఖ్య గణనీయంగానే ఉంది. ముందుగానే కల్యాణమండపాలు బుక్కయిపోయాయి. పేరున్న పురోహితులంతా బిజీబిజీనే. కేటరింగ్ నుంచి బాజాభజంత్రీల వారివరకూ అందరూ ఒప్పందాలు కుదుర్చేసుకున్నారు. ఈనెల 2వ తేదీ నుంచి మార్చి 16 వరకూ దివ్యమైన ముహూర్తాలు ఉన్నాయని వేదపండితులు చెబుతున్నారు. ఈఏడాది జూలై వరకూ కొన్ని ముహూర్తాలున్నాయంటున్నారు. నాలుగేళ్ల తర్వాత వరుస నెలల్లో శుభ కార్యాలు జరపుకొనేందుకు అవకాశం వచ్చిందంటున్నారు. ఈ క్రమంలో మాఘ మాసంలో పెళ్లిళ్లకు హడావుడి మొదలైపోయింది. వివాహంతో ముడిపడిన వివధ వర్గాల వారు ఏమంటున్నారో ఒకసారి తెలుసుకుందాం...

- తిరుపతి,నేరవార్తలు(ఆంధ్రజ్యోతి)


స్థాయిని బట్టి డెకరేషన్

పెళ్లంటే ఇప్పుడు అంతా అట్టహాసమే. ఒకప్పుడు సాదా సీదాగా చేసుకుని వెళ్ళే వారు. గతంలో కల్యాణ మండపాల్లో వేదిక డెకరేషన్ కోసం మహా అయితే రూ.30వేలు ఖర్చు పెట్టేవారు. కానీ రోజులు మారిపోయాయి. ఒకరిని చూసి మరొకరు అనుసరిస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వైరైటీ డెకరేషన్లపై ఆసక్తి చూపిస్తున్నారు. కనిష్టంగా రూ.50వేలయినా ఇందుకు కేటాయిస్తున్నారు. అక్కడ నుంచి స్థాయి,స్థోమతును బట్టి ఈ మొత్తం పెరిగిపోతోంది. రూ.2.50 లక్షలకు పైబడి ఎంతైనా వెచ్చించడానికి వెనుకాడటంలేదు. దీనికితోడు అన్ని రకాల మెటీరియల్ ధరలు పెరిగిపోయాయి. పూల ధలరను మరీనూ. బెంగళూరు నుంచి కొన్నిరకాల పుష్పాలను తెప్పిస్తున్నాం. మెహంది రకం పూల ఖరీదు బాగా పెరిగిపోయింది. వేదిక అలంకరణతో మెప్పించాలని పెళ్లివారు కోరుకుంటున్నారు.

- అరుణ డెకరేటర్, తిరుపతి



ఈ నెల ఎంతో శుభప్రదం



పురోహితులకు మాఘమాసమంతా బిజీగానే ఉంటుంది. ఈమాసానికి చాలా ప్రాధాన్యత ఉంది. ఈనెలలో ఏ శుభకార్యక్రమం చేసినా విష్ణుఆరాధనతో సమానం. వైవాహిక జీవితం సాఫీగా సాగుతుందని బలమైన నమ్మకం. అందుకే శుభకార్యాలెక్కువగా ఈనెలలోనే చేస్తుంటారు. ఈసారి మాఘమాసంలోపెళ్లిళ్ల చేసుకోడానికి మంచి ముహూర్తాలు ఎక్కువగానే ఉన్నాయి. ఈ నెల 31 నుంచి మార్చి 16 వరకు ముహూర్తాలు ఉన్నాయి. ప్రధానంగా ఫిబ్రవరి 2,3,7,13,14,15,18,19,20,21,23,25లతోపాటు మార్చిలో 1,2,6,7,12,16 తేదీల్లో ఎక్కువ వివాహాలు జరుగుతాయి.

- రామశర్మ,పండితుడు, తిరుపతి

ఈవెంట్ మేనేజర్లదే హవా



ఒకప్పుడు స్థానిక ఫోటో, వీడియో గ్రాఫర్లకు డిమాండ్ వుండేది. ఇప్పుడు ఈవెంట్ మేనేజర్లు అందుబాటులోకి వచ్చారు. ఎక్కడో కూర్చుని భోజనాలు మొదలుకుని, :ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్ల వరకూ అన్ని పనులూ చేస్తామని ఎంగేజి చేసుకుంటున్నారు. ఖరీదైన స్టిల్ వీడియోలు అడుగుతున్నారు. ప్రీ వెడ్డింగ్ షూట్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అన్ని నైపుణ్యాలు ఉంటేనే ఈ రంగంలో రాణింపు ఉంటోంది. ఈతరహా ఈవెంట్‌లు చేసే వారు ఎక్కువగా విజయవాడ, తిరుపతి, బెంగళూరు వంటి నగరాల నుంచి వస్తున్నారు. కల్యాణ మండపాలను వారే లీజుకు తీసుకుని మరీ నిర్వహిస్తున్నారు. పెళ్లి చేసేవారు కూడా ఖర్చుకు వెనకాడటంలేదు.



- మురళి, ఫ్యాషన్ స్టూడియో, తిరుపతి



రుచి నాణ్యతల కోసం ఎన్ని కష్టాలో..

క్యాటరింగ్ ట్రెండ్ పూర్తిగా మారిపోయింది. రుచికి,నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నారు. వివాహ భోజనంబు అన్నట్లుగా భోజనం బాగుంటే పెళ్లిబాగా అయినట్లు పెళ్లివారు భావిస్తుంటారు. దీంతో మామీద విపరీతమైన ఒత్తిడి ఉంటోంది. భోజనం బాగుందని తిన్నవారు చెబితే అదే మాకు పెద్ద పబ్లిసిటీ. అందుకోసమే చాలా తాపత్రయపడుతుంటాం. నిత్యావసర ధరలు పెరిగినా సరకులు



నాణ్యత లేక కస్టమర్లను సంతృప్తి పర్చడానికి చాలా కష్టపడాల్సి వస్తోంది. కమ్మని రుచితో ఘుమఘుమలాడే నెయ్యి దొరకడం గగనమైంది. ప్రస్తుత నూనెల పరిస్థితీ అలాగే ఉంది. అన్నింటికంటే ముఖ్యంగా ఈ పనిలో నైపుణ్యత ఉన్న మనుషులు దొరకడంలేదు. ప్రస్తుతం వెయ్యి మందికి భోజనాలు ఆర్డర్లు ఇవ్వడం కష్టంగా ఉంది. మాకూ పోటీ పెరిగింది. అయినా మాఘమాసం కదా. అందరికీ చేతినిండా పని.

- చలపతి, అన్నపూర్ణ క్యాటరింగ్ సర్వీసు



పీజీఆర్ఎస్ వినతులు 220

● అధికారుల ఆలస్యంపై కలెక్టర్ ఆగ్రహం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 220 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూకు సంబంధించి 116 అర్జీలు ఉన్నాయి. ఉదయం 10 గంటల నుంచే జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యలు చెప్పుకోవడానికి వచ్చారు. 10.30 గంటలకు కలెక్టర్ వెంకటేశ్వర్ వచ్చారు. అప్పటికీ వివిధ శాఖల ఉన్నతాధికారుల కుర్చీలు ఖాళీగా దర్శనమివ్వడంతో ఆయన ఒకింత అసహనానికి గురయ్యారు. సమయానికి రాని అధికారుల నుంచి సంజాయిషీ తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. పీజీఆర్ఎస్‌కు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీలు రోజ్మాండ్, దేవేంద్రరెడ్డి పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.



అధికారులు లేక ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు

ఇంటి పట్టాలు మంజూరు చేయండి

తిరుపతి అర్బన్ కొరమేనుకుంట దేముడు కాలనీలో నివసిస్తున్న ఎరుకుల, యానాదుల కుటుంబాలకు కరెంటు మీటర్లు, ఇంటిపట్టాలు మంజూరు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ డిమాండ్



చేశారు. ఈ మేరకు కాలనీవాసులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. ఆ ప్రాంతంలో 20ఏళ్లకు పైగా 130 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారని, వారికి కరెంటు మీటర్లు, మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, న్యాయం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, శివ, పద్మనాభరెడ్డి, రవి, రామకృష్ణ పాల్గొన్నారు.

సంఘమిత్ర మా సొమ్ము కాజేసింది

'మేము మహిళా పొదుపు సంఘంలో ఉన్నాం. తొట్టంబేడు యూనియన్ బ్యాంకులో రుణం తీసుకున్నాం. ప్రతినెలా రుణ సొమ్మును బ్యాంకులో జమచేయమని సంఘమిత్రలు మునిలక్ష్మి, మునిశేఖర్‌కు ఇచ్చాం.వారు ఆ నగదును బ్యాంకులో డిపాజిట్ చేయకుండా వాడుకున్నారు.న్యాయం చేయండి' అంటూ తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామానికి చెందిన మహిళలు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు.

పక్క రాష్ట్రాల మద్యం తెచ్చి విక్రయిస్తున్నారు



ఏర్పేడు మండలం పరమాలపల్లికి చెందిన ఆర్టీసీ ఉద్యోగి బాలరాజు పక్క రాష్ట్రాల నుంచి మద్యం తీసుకు వచ్చి విక్రయిస్తూ యువతను చెడుదారి పట్టిస్తున్నాడని, జాతీయ రహదారికి ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా గదులు నిర్మించారని గ్రామస్తులు హరికృష్ణ, మల్లికార్జున కలెక్టరేట్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు.

స్వామీ.. నీ దర్శనం కోసం







మంగళవారం జరిగే రథసప్తమి వేడుకల్లో సప్తవాహనాలపై స్వామివారిని దర్శించుకునేందుకు సోమవారమే తిరుమలకు చేరుకుని గ్యాలరీల్లో.. శ్రీవారి ఆలయం ముందు నిద్రిస్తున్న భక్తులు - మలయప్ప ఊరేగింపు సేవ కోసం సిద్ధమైన సూర్యప్రభ వాహనం



క్యాన్సర్ నిర్మూలన దిశగా అడుగులు

● జిల్లాలో జోరుగా స్క్రీనింగ్ పరీక్షలు ● స్విమ్స్, రుయాలో ప్రత్యేకవార్డులు
● నేడు ప్రపంచ క్యాన్సర్ దినం

తిరుపతి(వైద్యం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ మహమ్మారి నుంచి ప్రజలను రక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. ఈక్రమంలోనే జిల్లా వ్యాప్తంగా స్క్రీనింగ్ పరీక్షలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు స్విమ్స్ ఆధ్వర్యంలో 11,554మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా 1850మందిని అనుమానితులుగా గుర్తించారు. స్వీకర్ ఆధ్వర్యంలో 48వేల మందికి పరీక్షలు నిర్వహించగా 573 మంది అనుమానితులను గుర్తించారు.

మూడు చోట్ల సేవలు

స్విమ్స్ ఆవరణలోని బాలాజి ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజి ఆధ్వర్యంలో 30 పడకలతో పెయిన్, పాలియేటివ్ కేర్ వార్డును అందుబాటులోకి తీసుకువచ్చారు. చివరి దశ రోగులకు తొలుత చికిత్స అందించనున్నారు. టాటా ఆధ్వర్యంలో వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్(స్వీకర్), రుయాలో 10 పడకల పాలియేటివ్ కేర్ కేంద్రం క్యాన్సర్ రోగులకు విశేష వైద్య సేవలందిస్తున్నాయి. స్విమ్స్ పాలియేటివ్ కేర్ వార్డులో ఆరోగ్యశ్రీ వర్తించదు. దీనిని వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు బీఐవో ప్రత్యేకాధికారి జయచంద్రారెడ్డి తెలిపారు.

కేర్ ట్రాకర్ యాప్ ద్వారా సలహాలు

కేర్ ట్రాకర్ యాప్ క్యాన్సర్ రోగులకు ఉపయోగపడుతోంది. స్విమ్స్‌లో చికిత్స పొందిన వారి ఫోన్‌లో మొదట ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేస్తున్నారు. స్మార్ట్ ఫోన్ కలిగిన రోగుల, వారి సహాయకుల ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రోజు వారి ఆరోగ్య పరిస్థితిని యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ వివరాలను వైద్య బృందం పరిశీలిస్తుంది. అవసరమైతే వెంటనే వైద్య సలహాలను అందిస్తారు. లేదా ఆస్పత్రికి రావాల్సింగా సూచిస్తారు.

ఉపశమనం కోసమే పాలియేటివ్ కేర్



పాలియేటివ్ కేర్ వార్డును క్యాన్సర్ బాధితులకే కాకుండా న్యూరాలజీ, నెఫ్రాలజీ, సీవోపీడీ బాధితులకు కూడా అందుబాటులోకి తీసుకువస్తాం. వ్యాధి ముదిరి చివరి దశలో ఉన్న వారిని కంటికి రెప్పలా చూసుకోవాల్సి ఉంటుంది. వారికి నిత్యం వైద్య పర్యవేక్షణ అవసరం ఉంటుంది. అలాంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకువస్తాం

- డాక్టర్ ప్రాణబంధుదాస్, రేడియోషన్, అంకాలజి వైద్య నిపుణులు

దారి దోపిడీ కేసులో ఇద్దరు ఆటో డ్రైవర్ల అరెస్టు

● 24 గ్రాముల బంగారు నగలు, రెండు ఆటోలు, సెల్‌ఫోన్లు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుడిని బెదిరించి బంగారు నగలు లాక్కెళ్లిన ఘటనలో ఇద్దరు ఆటో డ్రైవర్లను తిరుపతి వెస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఈస్ట్ సీఐ మురళీ మోహన్ తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా కాట్పాడికి చెందిన గోవిందరాజులు సురేష్‌బాబు గత నెల 12న తిరుమలకు వచ్చారు. తిరుపతికి వచ్చిన ఈయన ఆటో ఎక్కారు. ఆ ఆటో



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు

డ్రైవరు మున్నూరు శివాజీ.. కొంత దూరం వెళ్లాక చెన్నారెడ్డి కాలనీకి చెందిన మరో ఆటో డ్రైవర్ చిన్నస్వామి కిరణ్‌కు ఫోన్‌చేసి రప్పించాడు. వీరిద్దరూ కలిసి సురేష్‌బాబును చితకబాది 24 గ్రాముల బంగారు చైను లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనపై బాధితుడు వెస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఆధ్వర్యంలో ఎస్ఐ అనిల్‌కుమార్, ఏఎస్ఐ వెంకటరత్నం, సిబ్బంది నిందితుల కోసం గాలించారు. ఆటో డ్రైవర్లు వాడుతున్న మొబైల్ నెంబర్ల ఆధారంగా ట్రాక్ చేసి సోమవారం సైన్సు సెంటరు వద్ద శివాజీ, చిన్నస్వామి కిరణ్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి బంగారు నగలు, రెండు ఆటోలు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేస్తామని సీఐ చెప్పారు.

13 కిలోల గంజాయి పట్టివేత

పాకాల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ సుదర్శన ప్రసాద్ తెలిపిన వివరాలిలా.. నెల్లూరు రూరల్ మండలం అల్లిపురం మేకలవారి తోటకు చెందిన సాన విష్ణుమోహన్ రెడ్డి, తమిళనాడుకు చెందిన ఆర్.పాండ్యన్‌లు విజయవాడ నుండి మదురై తరలించేందుకు 13 కేజీల గంజాయిని ఆదివారం పాకాల రైల్వే స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈ సమాచారం తెలుసుకుని సీఐ సుదర్శన్ ప్రసాద్, ఎస్ఐ సంజీవరాయుడు, తహశీల్దార్ సంతోష్‌సాయి పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకొని గంజాయి, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు.



నిందితులతో సీఐ సుదర్శన ప్రసాద్, పోలీసులు

17 నుంచి తిరుపతిలో ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో

● పాల్గొననున్న 58 దేశాల ప్రతినిధులు

తిరుమల, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ఆలయ మహాసభ, ఎక్స్‌పో 2025 కార్యక్రమం తిరుపతిలో ఈ నెల 17 నుంచీ మూడు రోజులపాటూ జరగనుంది. ఎంగళంరోడ్డులోని ఆశా కన్వెన్షన్‌లో సదస్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఆలయ నిర్వహణపై నిపుణుల చర్చలు, ప్రదర్శనలు, వర్క్‌షాప్‌లు, శిక్షణా తరగతులు.. ఈ సదస్సులో ఉంటాయి. 58కి పైగా దేశాల నుంచి 1,500 మంది హిందు, సిక్కు, బౌద్ధ, జైన సంస్థల ప్రతినిధులు హాజరు కానున్నారు. 2023లో తొలిసారిగా అంతర్జాతీయ ఆలయ మహాసభ, ఎక్స్‌పో(ఐటీసీఎక్స్) వారణాశిలో జరిగింది. ప్రధాని నరేంద్రమోదీతో పాటు హోంమంత్రి అమిత్‌షా వంటి ప్రముఖులు పాల్గొన్నారు. రెండవ ఎక్స్‌పో తిరుపతిలో నిర్వహించాలని నిర్ణయించారు. ఇంటర్నేషనల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో చైర్మన్ ప్రసాద్‌లాల్, టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరీష్ కులకర్ణి నేతృత్వం ఈసదస్సు జరుగనుంది.

చిరుత సంచారంతో..!

● ఎస్వీయూ లైబ్రరీ వెనుక చెట్ల పొదల తొలగింపు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చిరుత సంచారం నేపథ్యంలో ఎస్వీ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ వెనుక గల చెట్ల పొదలను సిబ్బంది తొలగిస్తున్నారు. లైబ్రరీ చుట్టు పక్కల ప్రాంతాలను పరిశుభ్రం చేస్తున్నారు. చిరుత పులి ఇటీవల లైబ్రరీ వెనుక జింకను చంపి తినడం తీవ్ర భయాందోళనకు గురిచేసింది. దీంతో లైబ్రరీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని యూనివర్సిటీ ఉన్నతాధికారులు ఆదేశించారు. లైబ్రరీ డైరెక్టర్ సురేంద్రబాబు, గార్డెనింగ్ డిపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్ కోటగారం మురళి నేతృత్వంలో రెండు, మూడు రోజులుగా లైబ్రరీ పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. తద్వారా చిరుత భయంతో వణుకుతున్న విద్యార్థులు, ఉద్యోగులకు కొంత ధైర్యం కలిగేలా చేస్తున్నారు.

రేపు ఎస్వీయూలో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఖాళీగా ఉన్న ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి బుధవారం స్పాట్ అడ్మిషన్లు చేపట్టారు. ఉదయం 10 గంటలకు అడ్మిషన్ కార్యాలయానికి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాల్సి ఉంటుంది. ఈఏపీసెట్-24 అర్హత కల్గిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఎంపీసీ, బైపీసీ చదువుకున్న వారు అర్హులని వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఊకా రమేష్‌బాబు తెలిపారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 52 వినతులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో క్రైం అదనపు ఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికకు 52 వినతులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలను పోలీసులకు వివరించారు.



వినతులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ

ఏడాదిలోగా అర్హులందరికీ టిడ్కో ఇళ్లు



టిడ్కో చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఏడాదిలోగా టిడ్కో ఇళ్లు అందజేస్తామని టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. సోమవారం వెంకటగిరిలోని టిడ్కో ఇళ్ల వద్ద లబ్ధిదారులతో ముఖాముఖీ నిర్వహించారు. నిరుపేదల సొంత ఇంటి కల నెరవేర్చాలన్న ధ్యేయంతో గతంలో సీఎంగా చంద్రబాబు 4.52 లక్షల టిడ్కో ఇళ్లు మంజూరు చేస్తే.. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ ఆ సంఖ్యను 2.16 లక్షలకు కుదించారన్నారు. పూర్తయిన గృహాలను లబ్ధిదారులకు అప్పగించకపోవడంతో అద్దె ఇళ్లలో ఉంటూ అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు టిడ్కో ఇళ్ల రుణాలు చెల్లించాలని బ్యాంకుల నుంచి ఒత్తిడి పెరగడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. టిడ్కో ఇళ్లలో యజమానులు నివాసం ఉండకుండా ఇతరులకు అద్దెకు ఇస్తే రద్దు చేయించి బాడుగకు ఉన్నవారికే కేటాయిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హెచ్చరించారు. టిడ్కో ఇళ్ల సమస్యలను పరిష్కరించాలని చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, శ్రీరామదాసు గంగాధర్, కేవీకే ప్రసాద్ నాయుడు, జనసేన నాయకులు తోటా కృష్ణయ్య, జంపాల ప్రకాష్, కస్తూరి, గునకల కిషోర్, రామారావు అనిల్‌కుమార్, రాదమ్మ, చిరంజీవి, జమీర్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

కలెక్టర్‌కు ఎమ్మెల్యే విజయశ్రీ విజ్ఞప్తి



కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, పక్కన టీడీపీ నాయకులు నెలవల రాజేష్, రఫీ, శెల్వం, సుదర్శన్ తదితరులు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను పరిష్కరించి అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కోరారు. సోమవారం కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని వట్రపాలెం ఏటా వర్షాల సమయంలో ముంపునకు గురవుతోందని, స్థానికులకు ఇబ్బంది లేకుండా శాశ్వత పరిష్కారం చూపించాలని కోరారు. అదే విధంగా రాష్ట్ర సరిహద్దు అయిన తడ మండలం పన్నంగాడు వద్ద ముఖద్వారం ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే నాయుడుపేటలో ముస్లింల కోసం ఈద్గాను నిర్మించి, ఆటోనగర్ ఏర్పాటు చేయాలన్నారు. నియోజకవర్గంలో అవసరమైన చోట సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెలవల రాజేష్, మొలచాం సుదర్శనరావు, బొమ్మన్ పళణి, శెల్వం, నాయుడుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ 786 రఫీ, కళానిధి, మునీంద్ర, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



పేదల నుంచి ఇళ్ల స్థలాల దరఖాస్తులను సేకరిస్తున్న సీపీఐ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలను కేటాయించాలని సీపీఐ నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని విందూరు, రామలింగాపురం గ్రామాల్లో ఇళ్లస్థలాలు లేని పేదల నుంచి సీపీఐ నాయకులు దరఖాస్తులను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు పట్టణ ప్రాంతంలో 2సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నేరవేర్చాలన్నారు. అలాగే ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అర్హులైన వారినుంచి దరఖాస్తులను సేకరించి ఈనెల 10వ తేదీన ఆయా సచివాలయాల్లో అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, కాలేషా, శశికుమార్, చంద్రయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుపై అవగాహన పెంచుకోవాలి

గూడూరు అర్బన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రజలు గుండెపోటుపై అవగాహన పెంచుకుని సరైన సమయంలో చికిత్స తీసుకుంటే ప్రాణాలను కాపాడుకోవచ్చునని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా అన్నారు. సోమవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆమె మాట్లాడుతూ ఛాతీనొప్పి రావడం, ఎడమభుజం లాగడం, ఆకస్మికంగా ఆయాసం రావడం వంటి గుండెపోటుకు లక్షణాలన్నారు. ఈ లక్షణాలు ఉన్నవారు మొదటి గంటలోపు సరైన చికిత్స పొందితే ప్రాణాలను నిలుపుకోవచ్చునన్నారు. ఆస్పత్రిలో టెనెక్టెప్లెస్ ఇంజక్షన్‌ను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకి వినతి

గూడూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని జనసేన నాయకులు సోమవారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ మాట్లాడుతూ కోట మండలం గూడలి సమీపంలోని రుద్రవరం నుంచి విద్యార్థులు మెట్టు గ్రామంలోని పాఠశాలకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంబలేరు సమీపంలో అసంపూర్తిగా ఉన్న వంతెనను పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మోహన్, సనత్, రాజా, సాయి, శంకర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు




చిన్నారులచే అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

తడ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సందర్భంగా సోమవారం చిన్నమాంబట్టులో ఉన్న కాశీవిశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణదేవి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. ఆలయంలో సరస్వతీదేవి పూజల నిర్వహించారు. అనంతరం సుమారు 50మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. పిల్లలకు పలక, పుస్తకం, బలపాలు, బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలకు ఉమ్మిటి కుమారస్వామి, చండీరాణెమ్మ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. తిరుపతి సిమ్స్ వైద్యుడు మునస్వామి, గ్రామపెద్దలు వెంకురెడ్డి, బట్టా రాజేశ్వరి, షణ్ముగం దేవకి తదితరులు పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని విద్యానగర్, కోట పట్టణాల్లో సోమవారం వసంత పంచమి వేడుకలు జరిగాయి. విద్యానగర్‌లోని బాలభారతీ విద్యాసంస్థల్లో కరస్పాండెంట్ కర్రా శ్రీనివాసమూర్తి, వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వాదాల మధ్య చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అదే విధంగా కోటలోని సోమేశ్వరాలయంలో అక్షరాభ్యాసాలు జరిగాయి.

సరస్వతీదేవికి పూజలు



వివిధ రకాల వేషధారణలలో చిన్నారులు

గూడూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సందర్భంగా సోమవారం స్థానిక స్వర్ణాంధ్రభారతి పాఠశాలలో చిన్నారులకు అక్షరాభ్యస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నవకోటి నాయుడు మాట్లాడుతూ సరస్వతీదేవి జన్మదినమైన వసంత పంచమి సందర్భంగా వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించి చిన్నారులచే అక్షరాభ్యసం చేయించడం జరిగిందన్నారు. అనంతరం చిన్నారులు వివిధ దేవుళ్ల వేషధారణలను ధరించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సునీల్‌రాజ్, హరికృష్ణ, సింధూ పాల్గొన్నారు.

మంగానెల్లూరులో చోరీ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగానెల్లూరులో జువ్వలపాటి సుబ్బులయ్య, నీలమ్మ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. బాధితుల కథనం మేరకు.. సుబ్బులయ్య, నీలమ్మ దంపతులకు ఆరోగ్యం బాగలేకపోవడంతో శనివారం మధ్యాహ్నం శ్రీకాళహస్తిలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. రాత్రి శ్రీకాళహస్తిలోనే బంధువుల ఇంట్లో ఉన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు ఇంటికి రావడంతో తాళాలు పగలగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న 10 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.50 వేల కనిపించలేదు. వెంటనే సూళ్లూరుపేటకు చేరుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ బ్రహ్మనాయుడు సిబ్బందితో మంగానెల్లూరుకు వెళ్లి చోరీ జరిగిన ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. తిరుపతి నుంచి క్లూస్ టీంను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం బాపూజీ వీధి లక్ష్మీ భవన్ హోటల్ సమీపంలో నిలిపి వుంచిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని యువకుడు అపహరించుకొని వెళ్లిన సంఘటన సోమవారం చోటుచేసుకొంది. వట్రపాలెం ప్రాంతానికి చెందిన ప్రశాంత్ తన భార్య కుమారితో కలిసి స్కూటీలో సూళ్లూరుపేట వచ్చాడు. లక్ష్మీ భవన్ హోటల్ సమీపంలో పార్కింగ్ చేసి సమీపంలో తోపడు బండిలో పిల్లలకు బట్టలు కొనేందుకు వెళ్లాడు. అర్థగంటలో తిరిగి రాగా స్కూటీ కనిపించలేదు. స్థానికులను వారించగా ఓ యువకుడు వచ్చి తీసుకెళ్లినట్లు తెలిపారు. పక్కనే ఓ షాపులో ఉన్న సీసీ పుటేజ్‌ను పరిశీలించగా ఓ యువకుడు స్కూటీ వద్దకు వచ్చి స్టార్ట్ చేసుకొని వేగంగా వెళ్లినట్లు కనిపించింది. బాధితుడు వెంటనే స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

నేడు చెంగాళమ్మ ఆలయ హుండీ లెక్కింపు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించనున్నట్లు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు.

అయ్యా.. మీరే దిక్కు!

జీవితాంతం తోడుంటానని వాగ్దానం చేసిన భర్త బిడ్డకు అనారోగ్యమని తెలిసీ పత్తాలేకుండా పోయాడు. చివరకు చనిపోయిన బిడ్డను తీసుకుని ఆమె అత్తారింటికి చేరుకుంది. అక్కడా మెట్టినింటివారు ఇంట్లోకి రానివ్వలేదు. ఇక తనబాధను ఎవరికి చెప్పుకోవాలో తెలియకా ఆ తల్లి బిడ్డ మృతదేహంతో సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుంది. కలెక్టర్ ఆనంద్ ఎదుట తన గోడు వెళ్లబోసుకుంది. తనకు న్యాయం చేయాలని వేడుకుంది. స్పందించిన కలెక్టర్ ముందు మీరు బిడ్డను తీసుకుని ఇంటికి వెళ్లండి. పోలీసులను పంపుతా. మీకేమీ ఇబ్బంది ఉండదు. ఆ తరువాత తగిన న్యాయం చేస్తానని చెప్పడంతో ఆమె వెనుదిరిగింది.

\- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

- తోడుంటానన్న భర్త ఎటు వెళ్లిపోయాడు
- కన్నబిడ్డ అసువులుబాసాడు!
- ఇంట్లోకి రానివ్వని మెట్టినింటివారు
- ఆదుకోవాలన్న కలెక్టర్‌ను వేడుకున్న ఓ మాతృమూర్తి
- న్యాయ చేస్తామని హామీ



చనిపోయిన బిడ్డతో కలెక్టరేట్‌కు వచ్చిన వరలక్ష్మి, ఆమె వదిన శ్రీలక్ష్మి

తనకు న్యాయం చేయాలని కోరుతూ బిడ్డ మృతదేహంతో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను వేడుకుంది. బాధితురాలు వరలక్ష్మి వదిన శ్రీలక్ష్మి ఆంధ్రజ్యోతికి వివరాలు వెల్లడించారు. మూలాపేటలో ఉంటున్న శ్రీకాంత్, వరలక్ష్మిలకు హృతిక్‌నందన్ అనే కొడుకు ఉన్నాడు. గూడూరు మండలం చెన్నూరుకు చెదిన రమణయ్య, వెంకటమ్మల కుమార్తె వరలక్ష్మికి నెల్లూరు మూలాపేటలో ఉంటున్న శ్రీకాంత్‌కు పెళ్లి అయ్యింది. వీరికి హృతిక్‌నందన్ అనే కుమారుడు ఉన్నాడు. పెళ్లి సందర్భంగా రెండున్నర సవర్ల బంగారం, రూ.5లక్షల నగదు కట్నంగా ఇచ్చారు. వరలక్ష్మి గర్భం దాల్చాక పుట్టినింటికి తీసుకువెళ్లారు. కుమారుడు హృతిక్‌నందన్ పుట్టాక కాలం వెళ్లతీస్తూ శ్రీకాంత్ తప్పించుకుని తిరిగేవాడని శ్రీలక్ష్మి తెలిపారు. చివరకు బిడ్డకు 9వ నెల వచ్చాక అత్తవారింటికి తీసుకుని వచ్చారు. ఆ తరువాత శ్రీకాంత్ తన భార్యతో కలిసి వేరు కాపురం పెట్టారు. కొద్దిరోజుల తర్వాత హృతిక్‌నందన్ అనారోగ్యం పాలవడంతో శ్రీకాంత్ ఎటో వెళ్లిపోయాడు. మెట్టినింటివాళ్లు కూడా సమాధానం ఇవ్వకపోవడంతో వైద్యం కోసం చెన్నైకు వెళ్లింది. చెన్నైలో డాక్టర్లు హృతిక్‌నందన్‌ను పరిశీలించి బ్రెయిన్ కేన్సర్ అని, నాలుగో స్టేజీలో ఉందని చెప్పారు. ఒకవేళ ఆపరేషన్ చేసినా ఏడాది కంటే ఎక్కువకాలం బతకడని చెప్పారు. ఇంటికి తీసుకుని వెళ్లమని సూచించారు. దీంతో వరలక్ష్మి దిక్కులేని స్థితిలో నెల్లూరుకు చేరుకుంది. వదిన సాయంతో జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో బిడ్డను చేర్పించింది. రెండు నెలల పాటు ఆ బిడ్డకు వైద్యం చేయించాక సోమవారం మృతిచెందాడు. మరణించిన బిడ్డను తీసుకుని అత్తవారింటికి వరలక్ష్మి వెళ్లగా అత్త, ఆడపడుచు, మరిది ఇంట్లోకి రానివ్వలేదు. పైగా ఇంటికి తాళం వేయడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆమె నేరుగా కలెక్టర్ దగ్గరికి వచ్చారు. చివరకు కలెక్టర్ హామీతో వరలక్ష్మి ఇంటకి వెళ్లింది.

యోగాతో ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చు



యోగా గురువు వసంతలక్ష్మిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చునని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యోగాసనాల్లో గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు సాధించిన యోగా గురువు వసంతలక్ష్మిని ఎమ్మెల్యే దంపతుల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి ప్రాంతానికి చెందిన వసంతలక్ష్మి యోగాలోని సమకోణాసనంలో 3గంటల 42నిమిషాల సమయం ఉండి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. యోగా ద్వారా ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు స్వయం ఉపాధిని పొందవచ్చునన్నారు. పట్టుదలతో కష్టపడితే దేనినైనా సాధించవచ్చునని వసంతలక్ష్మి రుజువు చేశారన్నారు. వసంతలక్ష్మి మాట్లాడుతూ యోగా ద్వారా ఏకాగ్రత పెరుగుతుందన్నారు. చిన్నతనం నుంచే తమ పిల్లలకు యోగాపై తల్లిదండ్రులు శిక్షణ అందజేయాలన్నారు. అనంతరం వసంతలక్ష్మిని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఆయన సతీమణి సంధ్యారాణి సన్మానించారు. కార్యక్రమంలో పెన్వర్ కంపెనీ డైరెక్టర్ గంటా మధుకృష్ణ, గాయత్రి, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, కల్పన, శైలజ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు దోచేసి.. ఇప్పుడు రీచ్‌ను రద్దు చేయాలా?: టీడీపీ

పెళ్లకూరు, ఫిబ్రవరి 3, (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని స్వర్ణముఖినదిలో ఇసుకను దోచేసిన వైసీపీ నేత చిందేపల్లి మధుసూదనరెడ్డి ఇప్పుడు రీచ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, స్వర్ణముఖినది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు అన్నారు. సోమవారం పెళ్లకూరులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు అవసరమైన ఇసుకను ఉచితంగా అందజేస్తోందన్నారు. స్వర్ణముఖినదిలో రైతులు ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ మోటార్లకు ఇబ్బంది లేకుండా ధికారులు చర్యలు తీసుకున్నారన్నాని చెప్పారు. పారదర్శంగా జరుగుతున్న ఇసుక పంపిణీని జీర్ణించుకోలేక రీచ్‌ను రద్దు చేయాలని గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శాఖమూరి కృష్ణమనాయుడు, మాడుపూరు మురళీ నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, జడపల్లి వెంకటేశ్వర్లు, చంద్ర పాల్గొన్నారు.



సమావేశంలో టీడీపీ నేతలు కృష్ణయ్య, ప్రసాద్ నాయుడు, మురళీ నాయుడు, కృష్ణమనాయుడు, సిద్దులయ్యనాయుడు

ప్రభుత్వ స్థలాల జోలికొస్తే చర్యలు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘువేంద్రమీనా

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల జోలికి వస్తే ఎంతటి వారైనా చట్టపరమైనా చర్యలు తీసుకుంటామని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనా హెచ్చరించారు. సోమవారం స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాల స్థలంలోని అక్రమ లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ సెలవులో ఉండగా కొంతమంది రాళ్ల నాటారని, దానిపై ఫిర్యాదు రావడంతో సర్వే చేయించి రాళ్ళు, సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, ఆర్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ వెంకటశర్మ తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శ్రీసిటీలోని దాదాపు 10 పరిశ్రమలు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం కోళ్లమిట్టలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. లో ఓల్టేజ్ సమస్య ఉండడంతో ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కోళ్లమిట్ట, ఎర్రపాలెం ప్రాంతాల కోసం అదనంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, అలవల శ్రీనివాసులు, విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాసులు, ఏడీఈ శేఖర్, ఏఈలు మురళి, మోహిని, పూర్ణిమ, ఎల్ఐ సురేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

కోతుల పట్టివేత

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట పట్టణంలో జనజీవనానికి ఇబ్బంది కలిగిస్తున్న కోతులను సోమవారం పట్టివేశారు. పట్టణంలోని రాజగోపాలపురం, రామకృష్ణాపురం, వెంకటేశ్వరపురం, గెరిడీవీధి, గిండివారితోట, అమరాగార్డెన్, పిచ్చిరెడ్డితోపు, టీచర్స్‌కాలనీ తదితర ప్రాంతాల్లో కోతులు ఇళ్లల్లోకి చొరబడి వస్తువులు తీసుకుపోవడంతో పాటు ఇబ్బందులు కలిగిస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాకు ఫిర్యాదులు అందాయి. దీంతో పట్టణంలో 210 కోతులను పట్టించి రాపూరు అడవుల్లో వదిలిపెట్టారు.

టిడ్కో ఇళ్లను కేటాయించండి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపాలిటీలో ఇళ్లు లేని పేదలకు టిడ్కో గృహాలను కేటాయించాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య కోరారు. సోమవారం స్థానిక 8వ సచివాలయం వద్ద ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

మున్సిపల్ కార్మికులకు వేతన బకాయిలను చెల్లించండి

నాయుడుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కార్మిక యూనియన్ గౌరవ అధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు మధు, హరికృష్ణ, మహాలక్ష్మమ్మ, నెలవల మణి, ఆరావళి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజయగణపతి ఆలయ వార్షికోత్సవం

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పిచ్చిరెడ్డితోపులో వెలసిన విజయగణపతి ఆలయంలో సోమవారం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. విజయగణపతికి పాలాభిషేకం, అష్టోత్తర పూజలు చేశారు. రాత్రి ప్రత్యేక పుష్పాలంకరణలో విజయగణపతికి నగరోత్సవం జరిపారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారుల చేత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

కోట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కోట మండలం విద్యానగర్ బాలభారతీ విద్యాసంస్థల సమీపంలో డివైడర్‌ను సోమవారం రాత్రి ఓ కారు ఢీకొట్టింది. నెల్లూరుకు చెందిన కొంతమంది వ్యాపారులు కారులో కోటకు వస్తుండగా విద్యానగర్ సమీపంలో డివైడర్‌ను వేగంతో ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి ఎలాంటి గాయాలు కాలేదు. కారు రెండు టైర్లు పగిలిపోగా ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యింది.

పెన్సిల్ ఆర్ట్ బహూకరణ



వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌ను వెంకటగిరికి చెందిన పెన్సిల్ ఆర్టిస్టు పోలిశెట్టి శంకర్‌బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. పెన్సిల్‌తో గీసిన అజయ్‌కుమార్ చిత్రాన్ని ఆయన బహూకరించారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి

కోట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ధాన్యానికి మద్దతు ధర కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం వెంకన్నపాళెంలో ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల రైతులు ధాన్యాన్ని అమ్ముకొంటున్నా మద్దతు ధర లభించ నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆర్‌బీకేల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోటేశ్వరరావు కోరారు.

నేలపట్టు, పులికాట్ అభివృద్ధికి శ్రీసిటీ ఫౌండేషన్ రూ.10 లక్షల విరాళం



సీసీఎఫ్ సెల్వంకు రూ.10 లక్షల చెక్కును అందజేస్తున్న శ్రీసిటీ డైరెక్టర్ నిరీషారెడ్డి, పక్కన డీఎఫ్‌వో హారిక, ఎఫ్ఆర్‌వో సౌజన్య తదితరులు

దొరవారిసత్రం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలైన నేలపట్టు, పులికాట్ పక్షుల రక్షిత కేంద్రాల్లో అభివృద్ధి పనుల కోసం శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలను శ్రీసిటీ డైరెక్టర్ సన్నారెడ్డి నిరీషారెడ్డి అందజేశారు. సోమవారం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో చిత్తడి నేలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శ్రీసిటీ డైరెక్టర్ నిరీషారెడ్డి, తిరుపతి సీసీఎఫ్(చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) సెల్వం, సూళ్లూరుపేట డీఎఫ్‌వో హారిక విచ్చేశారు. సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలల్లో పలు పాఠశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. నీరు, వన్యప్రాణులు, కలగలిసిన చిత్తడి నేలల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో నేలపట్టు ఎఫ్ఆర్‌వో సౌజన్య, స్థానిక వన్యప్రాణి సంరక్షణశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి




సమావేశంలో మాట్లాడుతున్న మెహబూబ్‌బాషా

గూడూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ మెహబూబ్‌బాషా అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ పరిధిలోని వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రీడల్లో నైపుణ్యాలను పెపొందించేలా శిక్షణ అందజేయాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు మాధవీ లక్ష్మి, వ్యాయమ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు భూముల ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంట్రంగం అంగీరి చెరువు భూములను కొందరు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని పంట్రంగం గ్రామస్తులు సోమవారం తిరుపతిలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. పంట్రంగ అంగీరి చెరువుకు సంబంధించి సర్వే నెంబరు 5లో సుమారు 12 ఎకరాలను రాగన్నపట్టెడ గ్రామానికి చెందిన నాగరాజు, మరికొంతమంది ఆక్రమించుకొని సాగు చేసుకొంటున్నారని తెలిపారు. అంతేకాకుండా దిగువ భాగంలో ఉన్న వ్యవసాయ భూముల్లోకి వెళ్లేందుకు దారి లేకుండా ఆక్రమణ దారులు కంచె ఏర్పాటు చేసుకొన్నారని వివరించారు. చెరువు భూముల ఆక్రమణ దారులపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోండి: విజయశ్రీ



రోగులను పరీక్షిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ విజయశ్రీ, పక్కన మాజీ ఎంపీ నెలవల, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ తదితరులు

నాయుడుపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అంటువ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యకరంగా ఉండగలుగుతామని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట తుమ్మూరులో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె రోగులను పరీక్షించారు. చికున్‌గున్యా, టైఫాయిడ్, మలేరియా, జలుబు, దగ్గు వంటి వాటిపట్ల ముందస్తుగా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ చేరకుండా చూడాలన్నారు. దోమల నివారణకు బ్లైటెక్స్ వంటి ద్రావణాలను పిచికారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాకు సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, కమిషనర్ ఫజులుల్లా, టీడీపీ నాయకులు నెలవల రాజేష్, పసల గంగాప్రసాద్, పసల పెంచలయ్య, మైలారి రాజశేఖర్, పేరంశెట్టి శ్రీరామ్‌ప్రసాద్, అవధానం సుధీర్, శివాజీరెడ్డి, దార్ల రాజేంద్ర, గుంటూరు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.